తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సోమవారం-29-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:124 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

# తిలక్ షో..

## భారత్ ఆసియా కప్ విజేత

- కుల్‌దీప్ యాదవ్ కీలక వికెట్లు
- తిలక్ వర్మ అద్భుత ఇన్నింగ్స్
- సంజూ శాంసన్ తో భాగస్వామ్యం
- దూబే హిట్స్‌తో మ్యాచ్ మలుపు
- చివరి ఓవర్లలో ఉత్కంఠ
- ప్రేక్షకుల ఆనందం ఊగిసలాట



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఇది కదా మ్యాచ్ అంటే.. ఇలాంటి ఆట కదా అభిమానులు కోరుకునేది.. క్షణక్షణం ఉత్కంఠ.. ఓటమన్నదే ఎరుగకుండా జైత్రయాత్ర సాగిస్తున్న భారత్.. ఫైనల్‌లో ఓటమిపాలవుతుందా అన్న సందేహాలను పటాపంచలు చేసింది. దాయాది దేశం పాక్‌తో ఎప్పుడు మ్యాచ్ జరిగినా ఒక్కసారిగా పునకాలు తెచ్చుకునే భారత ఆటగాళ్లు.. ఫైనల్‌లో జూలు విదిలించారు. తక్కువ స్కోరే లక్ష్యమైనప్పటికీ కీలక వికెట్లు పడ్డ వేళ.. మోయలేని ఒత్తిడిని తట్టుకొని భారత బ్యాటర్లు విజృంభించారు. స్టేడియంలోని ప్రేక్షకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోయిన అభిమానులు మునివేళ్లపై నిలుచుని మ్యాచ్‌ను ఆసాంతం చూసిన వేళ.. భారత్ మరోసారి దాయాది దేశాన్ని మట్టికరించింది.

మిగతా 8లో..

# న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా

- ఇకపై పాలన ఫ్యూచర్ సిటీ నుంచే: సీఎం రేవంత్
- నెలలో 3, 4 రోజులు నేను, భట్టి ఇక్కడే ఉంటాం : సీఎం రేవంత్
- పదేళ్లు అవకాశమిస్తే ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఇక్కడికి రప్పిస్తా
- మీ భూములు గుంజుకోం.. ఒప్పించి, మెప్పించే తీసుకుంటాం
- డిసెంబర్‌లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ భవనం ప్రారంభం



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచే పరిపాలన సాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇకపై సచివాలయంలో కాకుండా ఫ్యూచర్‌సిటీ ఆఫీసులో కూర్చుని పనిచేస్తానని చెప్పారు.

మిగతా 2లో..





## తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి: కేటీఆర్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్, భాజపా జాయింట్ వెంచర్ నడుపుతున్నాయని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు జరిగి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కాంగ్రెస్, భాజపా ఒకటేనని, రాష్ట్ర ప్రయోజనాలను ఆ రెండు పార్టీలూ కాపడలేవని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం కడ్తాల్‌లో కేటీఆర్ పర్యటించారు. కడ్తాల్‌లో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. మాట ఇచ్చి.. తప్పిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడినంత హీనంగా ఏ సీఎం మాట్లాడలేదని అన్నారు. "రాష్ట్రం దివాళా తీసిందని సీఎం అంటే ఎవరు నమ్ముతారు? పాలమూరు, రంగారెడ్డిలో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.55 వేలు బకాయిలు ఇవ్వాలి. ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ నేతలను బకాయిలపై నిలదీయాలి. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకొని.. మిగతా బకాయిల గురించి అడగాలి. ఆల్మట్టి ప్రాజెక్టును ఆపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? లేదంటే గులాబీ దండు కదలాలా? ఆల్మట్టి ఎత్తు పెంపుపై రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి" అని కేటీఆర్ అన్నారు.

# మన బతుకమ్మ కార్నివాల్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., ఒక్కేసి పువ్వేసి సందమామా.. చిత్తూచిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గు మ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోనా'అంటూ బతుకమ్మ పాటలతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం మార్మోగనుంది. బంతి, చేమంతి, గునుగు, గులాబీ, తంగేడు, గడ్డిపువ్వు వంటి తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలు దర్శనమివ్వబోతున్నాయి. ఒకే వేదికపై పదివేల మంది మహిళలు బతుకమ్మ ఆడిపాడి కనువిందు చేయబోతున్నారు. మన బతుకమ్మ కార్నివాల్ పేరుతో నిర్వహించనున్న ఈ అద్భుత దృశ్య కావ్యానికి సరూర్‌నగర్ స్టేడియం వేదిక కాబోతోంది.

నవరాత్రి వేడుకల్లో భాగంగా తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన 'గిన్నిస్ వరల్డ్ రికార్డు ఈవెంట్'కు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇండోర్ సహా అవుట్ డోర్ స్టేడియాల్లో 63 అడుగుల ఎత్తు బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నారు. గ్రేటర్ జిల్లాలు సహా సరిహద్దు జిల్లాల నుంచి 200 బస్సుల్లో మహిళలను ఆదివారం ఉదయమే స్టేడియానికి రప్పించి, ఆయా పాటలకు శిక్షణ ఇప్పించారు. వేడుకలో భాగంగా పాడే పాటలు, ప్రదర్శనలపై ముందే రిహార్సల్స్ చేశారు. సోమవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నిర్వహించనున్న బతుకమ్మ ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డులో సంస్థ ప్రతినిధులు నమోదు చేయనున్నారు.

వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నారు. ఈ మేరకు ఆదివారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ పంకజా, టూరిజం ఎండీ క్రాంతి, పలువురు అధికారులు స్టేడియానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు.



# తెలంగాణ గ్రూప్-2 ఫలితాలు విడుదల


(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)




తెలంగాణలో గ్రూప్2 ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం (సెప్టెంబర్28) మధ్యాహ్నం తెలంగాణ పబ్లిక్ సర్విస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. 783 పోస్టులకు 782మంది ఎంపికయ్యారు. ఒక పోస్టు మాత్రం భర్తీ కాలేదు. గ్రూప్2 అబ్బాయిలలో 1.హర్ష వర్ధన్, 2.సచిన్, 3.మనోహర్ రామ్, 4.శ్రీరామ మధు, 5.ప్రితం రెడ్డి టాపర్స్‌లో నిలవగా.. అమ్మాయిలలో 1.వినిషా రెడ్డి, 2.సుస్మిత, 3.శ్రీవేణి, 4.శ్రీలత, 5.స్నేహ నిలిచారు. గ్రూప్-2 సర్విసులకు సంబంధించి 18 కేటగిరీల్లో 783 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ జారీ చేసింది. 2023 జనవరి 18నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు... దాదాపు నెలరోజుల పాటు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించింది. 5,51,855 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలు దాదాపు మూడుసార్లు వాయిదా పడ్డాయి. చివరకు గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో.. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 1,368 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించింది. ఆ పరీక్షా ఫలితాలు కొద్ది సేపటి క్రితం విడుదలయ్యాయి.

# గురుకుల కాంట్రాక్టర్లకు బిల్లులెప్పుడిస్తరు?

- 6 నెలలుగా ఇవ్వక పోవడం సిగ్గుచేటు
- సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్
- హరీశ్‌రావును కలిసిన కాంట్రాక్టర్లు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

గురుకులాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే, గురుకులాకు సరుకులను ఎలా సరఫరా చేస్తారని? పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారని? ప్రశ్నించారు.

మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు

**పర్వతగిరి,సెప్టెంబర్28(పర్వతగిరి):**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల జమలాపురం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు చేతుల మీదుగా జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జమలాపురం పరిధిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు ఒక చారిత్రాత్మక అభివృద్ధి అడుగని పేర్కొన్నారు. దీని ద్వారా పర్వతగిరి మండలం సహా పరిసర గ్రామాలకు స్థిరమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని చెప్పారు. వ్యవసాయం, గృహోపయోగం, చిన్నపాటి పరిశ్రమలు అన్నీ ఈ సబ్‌స్టేషన్ వల్ల లాభపడతాయని తెలిపారు.

రైతులు సాగు కోసం భూగర్భ జలాలను సులభంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుందని, విద్యార్థులు చదువులో అంతరాయం లేకుండా అభ్యసించేందుకు వీలు పడుతుందని అన్నారు. విద్యుత్ సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారం కానుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంలో కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# గురుకుల కాంట్రాక్టర్లకు బిల్లులెప్పుడిస్తరు?

(మొదటి పేజీ తరువాయి)

గురుకులాల కాంట్రాక్టర్లు హరీశ్‌రావును ఆదివారం కలిశారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నదని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ కల్తీ ఆహారంతో గురుకుల విద్యార్థులు దవాఖానల పాలై ప్రాణాలు వదులుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం శోచనీయమని, గురుకుల విద్యార్థులు పస్తులుండవద్దన్న బాధ్యతతో కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి మరీ భోజనాలు పెడుతున్నారని తెలిపారు. అప్పులు పెరిగి కాంట్రాక్టర్లు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని వాపోయారు.

సుమారు 5000 మంది గురుకులాల కాంట్రాక్టర్లకు బతుకమ్మ, దీపావళి పండుగ సంబురం లేకుండా చేయడం దుర్మార్గమని హరీశ్ నిప్పులు చెరిగారు. అధికారులను కలిసి బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఈ ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, గురుకుల పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

# అమెరికా టారిఫ్‌లతో భారత్ వృద్ధికి ఇబ్బందే

### క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక

భారతీయ వస్తు దిగుమతులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లతో మన దేశ వృద్ధికి ఇబ్బందులు తలెత్తవచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ సెప్టెంబరు నివేదికలో వెల్లడించింది. ఈ టారిఫ్‌ల వల్ల భారతీయ వస్తు ఎగుమతులు, పెట్టుబడులపై ప్రభావం పడుతుందని తెలిపింది. అయితే సానుకూల ద్రవ్యోల్బణం, రేట్ల కోతల వల్ల దేశీయ వినియోగం పెరగడంతో వృద్ధికి కొంత మద్దతు లభించే అవకాశం ఉందని వివరించింది.

202526 తొలి త్రైమాసికం (ఏప్రిల్‌జూన్) లో దేశ జీడీపీ వృద్ధి 5 త్రైమాసికాల గరిష్ఠమైన 7.8 శాతానికి చేరింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 7.4 శాతంగా నమోదైన సంగతి విదితమే. సాధారణ(నామినల్) జీడీపీ వృద్ధి మాత్రం 10.8 శాతం నుంచి 8.8 శాతానికి పరిమితం కావడం గమనార్హం. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతానికి పరిమితం కావొచ్చని నివేదిక అంచనా వేసింది. 202425లో ఇది 4.6 శాతంగా నమోదైంది.

వ్యవసాయ వృద్ధి ఆరోగ్యకరంగా ఉండటంతో ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని నివేదిక తెలిపింది. అయితే అధిక వర్షాల ప్రభావం ఈ రంగంపై ఎలా ఉంటుందనేది మదింపు చేయాల్సి ఉందని పేర్కొంది. ముడి చమురు ధరలు తక్కువగా ఉండటం, అంతర్జాతీయంగా కమొడిటీ ధరలు సానుకూలంగా ఉండటంతో ఆహారేతర ద్రవ్యోల్బణం కూడా పరిమిత శ్రేణిలోనే ఉండొచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్వహించబోయే ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో ఇంకోసారి రేట్ల కోతకు మొగ్గు చూపొచ్చని నివేదిక అంచనా వేసింది.




# న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవన నిర్మాణంతోపాటు రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'భూమి విలువ నాకు తెలుసు. వ్యవసాయంతోనే కాదు వ్యాపారంలోనూ భూమితో నాకు సంబంధం ఉంది. మీ తాతల నాటి ఆస్తులు గుంజుకునే ఆలోచన నాకు లేదు. బాధితులకు పూర్తిగా న్యాయం చేసిన తర్వాతే భూములు తీసుకుని ముందుకు వెళ్తాం. డిసెంబర్‌లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించుకోబోతున్నాం. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తాం. ఇకపై సచివాలయంలో కాకుండా ఫ్యూచర్‌సిటీ ఆఫీసులో కూర్చుంటా. నెలకు మూడుసార్లు ఇక్కడే ఉంటా. ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ఇకపై ఇక్కడి నుంచే చేపడుతా. నాతోపాటు ఉపముఖ్య మంత్రి భట్టి కూడా నెలకు నాలుగుసార్లు ఇక్కడికి వస్తారు. ఆయన కూడా తన కార్యకలాపాలను ఇక్కడి నుంచే కొనసాగిస్తారు. సింగరేణి సంస్థ కోసం 10 ఎకరాలు కేటాయించి, 2026 డిసెంబర్‌లోగా ఆఫీసును ప్రారంభించాల్సిందిగా కోరుతున్నా. ఫ్యూచర్‌సిటీలో ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లు కూడా తొలగించి, యూజీ కేబుల్స్ వేయబోతున్నాం. ఈ ఫ్యూచర్‌సిటీలో ఫార్చ్యూన్ 500 జాబితాలోని కంపెనీలు ఉండాలని కోరుకుంటున్నా. ఇప్పటివరకు నగరంలో 85 వరకే ఉన్నాయి. రాబోయే పదేళ్లలో ప్రతి కంపెనీ ఇక్కడ పెట్టుబడి పెట్టే విధంగా తీర్చిదిద్దుతున్నాం'అని వివరించారు. భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే తమ ప్రభుత్వం కష్టపడుతోందని సీఎం రేవంత్ తెలిపారు. 'ఈరోజు కూడా భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. కానీ మంచి సంకల్పంతో చేపట్టిన నవ్య.. భవ్య.. భారత్ ఫ్యూచర్ సిటీకి శంకుస్థాపన కోసం వరుణుడు కూడా సహకరించాడు. రేవంత్‌రెడ్డికి భూములున్నాయని చెప్తున్నారు. ఆయన కోస మే నగరం కడుతున్నారని ఆరోపిస్తున్నారు. నాకు భూమి ఉంటే భూమి మీదే ఉంటుంది. రహస్యంగా దాచుకోవడానికి నా దగ్గరేమీ లేదు. నేను నాగురించో.. నా సహచర మంత్రుల గురించో ఆలోచన చేయడం లేదు. మేమంతా రేపటి తరాల కోసమే ఆలోచన చేస్తున్నాం'అని సీఎం పేర్కొన్నారు. 'కుతుబ్‌షాహీలు, నిజాంలు పునాదులు వేసిన హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు నేడు ఎంతో అభివృద్ధి చెందాయి. నాడు చంద్రబాబు, వైఎస్సార్ మాకెందుకు అనుకుని ఉంటే..ఇవాళ హైటెక్‌సిటీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వచ్చేవి కాదు. నాటి నాయకుల ఆలోచన వల్లే ఫార్మా, ఐటీ రంగంలో ప్రపంచంతో పోటీపడుతున్నాం. సిలికాన్ వ్యాలీలో మన పిల్లలు గొప్ప స్థానాల్లో ఉన్నారు. గతకాలపు నేతల నుంచి మంచిని నేర్చుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. భవిష్యత్తు తరాల కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ. న్యూయార్క్, టోక్యో, సింగపూర్, దుబాయ్ తరహాలో ఫ్యూచర్‌సిటీ గురించి గొప్పగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతాం. నాకు పదేళ్లు అవకాశం ఇవ్వండి. న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు కూడా ఫ్యూచర్ సిటీ గురించి చెప్పుకునేలా అభివృద్ధి చేస్తాం'అని సీఎం తెలిపారు. ఫ్యూచర్‌సిటీకి తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర నగరాలకు రవాణా సౌకర్యం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని సీఎం తెలిపారు. 'ఫ్యూచర్ సిటీ నుంచి శ్రీశైలం వరకు 100 మీటర్ల రోడ్డు వేస్తున్నాం. ఇటు ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరు వరకు రోడ్డు, బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నాం. దక్షిణ భారతదేశంలో నౌకాశ్రయం లేని రాష్ట్రం తెలంగాణ మాత్ర మే. ఈ కొరతను తీర్చేందుకు మచిలీపట్నం వరకు రోడ్డు వేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం అనుమతించింది'అని చెప్పారు. రైతులు నాయకుల ఉచ్చులో చిక్కుకుని నష్టపోవద్దని సూచించారు. బాధిత రైతులతో మాట్లాడి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్, టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. 'అందరికీ న్యాయం చేస్తా. కోర్టు బయట కూర్చొని నష్టాన్ని పూడ్చుకుందాం'అని సూచించారు. దేశ భవిష్యత్తు అంతా ఫ్యూచర్ సిటీ చుట్టే తిరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఏ నగరానికి లేని రేడియల్ రోడ్లు, సర్వీసు రోడ్లు, మెట్రో సౌకర్యం దీనికి ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఈ సిటీ ప్రపంచానికే తలమానికం అవుతుందన్నారు. ఈ ప్రాంత వాసులకు అత్యాధునిక వైద్యశాలలు, కాలేజీలు, వర్సిటీలు, పరిశ్రమలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. సింగరేణి గ్లోబల్ కార్పొరేషన్ ఆఫీసు నిర్మాణాన్ని ఏడాదిలోపే పూర్తి చేస్తామని వెల్లడించారు. కొత్త యుగానికి కొత్త బాటలు వేయాలనే ఆలోచనతో ప్రణాళికాబద్ధమైన ఫ్యూచర్‌సిటీకి శంకుస్థాపన చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. చండీగఢ్ కంటే పది రెట్లు భిన్నంగా ఫ్యూచర్‌సిటీ రాబోతోందని చెప్పారు. సిటీ నిర్మాణం, అభివృద్ధిలో ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# రేమండ్: కంప్లీట్ మాన్‌కు వందేళ్లు




అది 1925. భారత్‌లో బ్రిటిషర్లు, బ్రిటిష్ వస్తువులు రాజ్యమేలుతున్న సమయం. థాణేలో ఆల్బర్ట్ రేమండ్ ఒక చిన్న ఉన్ని మిల్లును స్థాపించారు. అత్యున్నత నాణ్యత గల దుస్తుల బ్రాండ్‌గా వందేళ్లు కొనసాగుతుందని ఆ సమయంలో ఆయన అనుకుని ఉండరేమో. గతంతో పోలిస్తే రేమండ్ ప్రస్తుతం ఆర్థికంగా, వ్యూహాత్మకంగా బలంగా ఉంది. పురుషుల దుస్తుల విభాగంలో ఈ బ్రాండ్‌కు తిరుగులేదు. స్థిరాస్తి వెంచర్ బాగానే రాణిస్తోంది. రక్షణ, ఇంజినీరింగ్‌లోకీ అడుగుపెట్టడంతో వృద్ధికి కొత్త ఊతం లభించినట్లే. అయితే దుస్తులు, రిటెయిల్ రంగంలో ఇపుడు జరుగుతున్న మార్పులకు తగ్గట్లు రేమండ్ కూడా వేగాన్ని పెంచగలదా అన్నదానిపైనే ప్రశ్నలు వస్తున్నాయి. రేమండ్ రూ.11,000 కోట్ల టర్నోవరులో రేమండ్ లైఫ్‌స్టైల్‌దే 60% వాటా. మరో 2 లిస్టెడ్ కంపెనీలైన రేమండ్ రియాల్టీ, రేమండ్ లిమిటెడ్‌కు మిగతా వాటా ఉంది.

ప్రపంచంలోనే అతిపెద్ద ఏకీకృత సూటింగ్ ఫ్యాబ్రిక్ తయారీదార్లలో రేమండ్ కూడా ఒకటి. అయితే 100 ఏళ్ల ఈ కంపెనీ తన బ్రాండెడ్ అపారెల్ విషయంలో తనకున్న ప్రయోజనాలను పూర్తిగా అందిపుచ్చుకోలేదని విశ్లేషకులు అంటుంటారు. ఇతర రంగాల్లోకి అడుగుపెడుతూ గ్రూపును వైవిధ్యీకరిస్తున్నప్పటికీ జౌళి, దస్తుల వ్యాపారంపై ఎక్కువ దృష్టిని పెట్టాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఆదిత్య బిర్లా ఫ్యాషన్, అరవింద్ ఫ్యాషన్స్ వంటివి ఆలస్యంగా వచ్చినా, వేగంగా విస్తరిస్తున్నాయి. దక్షిణాదిన ఈ రెండు బ్రాండ్లను మాల్ డెవలపర్లు ఎంచుకుంటున్నారు. మహిళల దుస్తుల్లోనూ ఇవి విస్తరిస్తున్నాయి. మహిళా విభాగంలోకి రేమండ్ అడుగుపెట్టినా ఇంకా పుంజుకోలేదు. ఎగువ మధ్యతరగతి కూడా కొనలేని ప్రీమియం బ్రాండ్లు రేమండ్స్ ప్రీమియంలో ఉన్నాయి. టాటాకు చెందిన ట్రెంట్ తన బ్రాండ్లయిన వెస్ట్‌సైడ్, జూడియోలతో మధ్యతరగతికి దగ్గరవుతోంది. ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీని విక్రయించి.. లైఫ్‌స్టైల్, స్థిరాస్తి కంపెనీలను విడిగా నమోదు చేయడంతో రేమండ్ గ్రూప్ బలపడింది. రుణాల్లేని సంస్థగా నిలిచింది. దీంతో చేతిలో ఉన్న నగదుతో కొత్త అవకాశాల వైపు అడుగుపెట్టింది. స్థిరాస్తిలో దూకుడుగా వెళుతోంది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్‌తో భాగస్వామ్యం ద్వారా రక్షణ, ఏరోస్పేస్‌లోకి అడుగుపెట్టింది. అయితే ఒక విశిష్ట బ్రాండ్‌గా తన వారసత్వాన్ని కొనసాగించాలంటే వినియోగదారు విభాగాలన్నింటిలోకి దుస్తుల బ్రాండ్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

# 'సిరి'లో కీలక మార్పులకు యాపిల్ ChatGPT తరహా యాప్!



ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన పర్సనల్ అసిస్టెంట్ 'సిరి'కి భారీ అప్‌గ్రేడ్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు కోసం ముందస్తు పరీక్షలు చేసేందుకు చాట్‌జీపీటీ తరహా యాప్‌ను రూపొందించింది. వెరిటాస్ అనే కోడ్ నేమ్‌తో రూపొందించిన ఈ యాప్ యాపిల్ ఇంజినీర్లు మాత్రమే ఉపయోగించేలా డిజైన్ చేశారు. దీని ద్వారా NextGen సిరి ఏఐ ఫీచర్లను టెస్ట్ చేసి, లోపాలను సరిచేసి 2026లో విడుదలకు సిద్ధం చేయనున్నారు.

వెరిటాస్ అంటే లాటిన్‌లో 'నిజం' అని అర్థమని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ పేర్కొంది. కంపెనీ ఈ యాప్‌ను అంతర్గతంగా వినియోగిస్తోందని తెలిపింది. ప్రస్తుతం యాపిల్ ఏఐ టీమ్ ఈ యాప్ ద్వారా రియల్ వరల్డ్ చాట్స్‌ను అనుకరిస్తూ.. సిరి సమాధానాల నాణ్యత, ప్రాంప్ట్ స్ట్రాటజీస్, ఎర్రర్ హ్యాండ్లింగ్ లాజిక్ వంటి అంశాలను మెరుగుపరుస్తోంది. ఈ యాప్ కూడా మార్కెట్లో ఉన్న ఇతర చాట్‌బాట్స్‌లానే పని చేస్తుంది. 'లిన్‌వుడ్' పేరుతో అభివృద్ధి చేసిన లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఆధారంగా ఈ యాప్ రూపుదిద్దుకుంది. నెక్స్ట్‌జెన్ సిరి.. భవిష్యత్‌లో ఈ సిస్టమ్‌పై ఆధారపడి పనిచేయనుంది.

తొలుత ఐఓఎస్ 18తో నెక్స్ట్‌జెన్ సిరిని విడుదల చేయాలని యాపిల్ ప్రణాళిక రచించింది. ఆలస్యం కావడంతో 2026 మార్చిలో మార్కెట్లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాదు, వచ్చే ఏడాది చివరికి సిరి డిజైన్‌కూ మార్పులు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం గూగుల్, శాంసంగ్‌లతో పోలిస్తే ఏఐ రంగంలో యాపిల్ వెనుకబడి ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు ఏఐ సేవలు అందించేందుకు యాపిల్ ఇప్పటికే పలు ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా ఓపెన్‌ఏఐ, క్లాడ్, గూగుల్ జెమిని టీమ్‌లతో చర్చలు జరిపింది. భవిష్యత్తులో ఏఐ ఆధారిత స్మార్ట్ హోమ్ డివైజెస్, వెబ్ సెర్చ్ సేవల్లో కూడా కొత్త ఫీచర్లను తీసుకురావాలని యోచిస్తోంది.





# ఆలయాల అభివృద్ధి ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే : హరీష్‌రావు

**ఉప్పల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ శిల్పారామంలో ఆలయాల పునరుద్ధరణలో భాగంగా మన గుడి - మన బలం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, మాజీ గవర్నర్ బంధారు దత్తాత్రేయ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సూరభి వాణి దేవి హాజరయ్యారు.ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, "చట్టాలు చేయలేని పనులు దేవుడిపై ఉన్న విశ్వాసం చేస్తుంది. ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు అర్చకులు, సిబ్బందికి వేతనాలు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే" అని పేర్కొన్నారు. ఆలయాలకు విస్తృతంగా నిధులు కేటాయించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని తెలిపారు. భవిష్యత్ తరాలకు విశ్వాసం, నమ్మకాన్ని పెంపొందించడం బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాలాచారి, దేవి ప్రసాద్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాదం వితరణ

**కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**





ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్లోని బ్యాంక్ కాలనీ దుర్గా మాత అమ్మవారి ఆలయంలో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.తదుపరి, కళ్యాణపురి కాలనీలో చండీ హోమం కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని, దుర్గా మాత మండపాలను దర్శించి భక్తుల కు ఆశీర్వాదాలు అందించారు.అలాగే, సాయిరాం నగర్, రాఘవేంద్ర నగర్, కళ్యాణపురి కాలనీలలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, బంటి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లిలో యూని ప్లానెట్ ఓవర్సీస్ స్టడీస్ సంస్థ ప్రారంభం

**మేడ్చల్ మల్కాజ్గిరి,**

**సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**





కొంపల్లిలో యూని ప్లానెట్ - ఓవర్సీస్ స్టడీస్ సంస్థ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ఒకప్పుడు చదువుకోవడానికి హైదరాబాద్ వచ్చిన వారిని విదేశాలకు వెళ్లినట్లుగా భావించేవారు. గత నలభై ఏళ్లలో ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారింది. ఈరోజు ఒక వ్యక్తి ఇక్కడ బ్రేక్‌ఫాస్ట్ చేసి, మరో దేశంలో లంచ్ చేసి, ఇంకో దేశంలో డిన్నర్ చేసే స్థాయికి చేరుకున్నాడు. భారత విద్యార్థుల్లో విదేశాల్లో చదవాలనే ఆసక్తి గణనీయంగా పెరిగింది. అమెరికా, లండన్, యూరప్ దేశాలకు పెద్దఎత్తున విద్యార్థులు వెళ్తున్నారు. అలాంటి విద్యార్థులకు సదుపాయాలు కల్పించేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి" అన్నారు.భరత రెడ్డి, రేఖ రెడ్డి, అజిత్, నిఖితా రెడ్డి ఆధ్వర్యంలో యూని ప్లానెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొంపల్లి వేగంగా విస్తరిస్తున్న ప్రాంతమని, ఇక్కడి నుంచి వేలమంది విద్యార్థులు విదేశాలకు వెళ్లే అవకాశం ఉందని, ఈ సంస్థ వారికీ మరింత విశ్వాసం కల్పిస్తుందని ఈటల నమ్మకం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో బైరెడ్డి సిద్ధార్ధ రెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, రాజి రెడ్డి, సతీష్ సాగర్, శివాజీ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.


# 190వ జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహణ కీసర గ్రామ పెద్దలు

**కీసర, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**



కీసర గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటలకు 190వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యం చేశారు.క్రమంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర గ్రామ పెద్దలు మొరుగు దశరథ్, పూంద్రు మహేష్‌కుమార్, చినింగని నరసింహ, చిన్న మొరుగు వెంకటేష్, తుడుం రమేష్, కర్రె యాదగిరి పాల్గొన్నారు. పెద్ద మాతర్లు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా గ్రామస్తులు కృషి చేయాలని హర్షం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోనే గొప్ప మేధా శక్తిమంతుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్" అని స్మరించారు.కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం సంయుక్త కార్యదర్శులు కట్ట శంకరయ్య, మాజీ ఎంపీపీ రామారం సుజాత, మాజీ ఎంపిటిసి మంచాల పెంటయ్య, మాజీ వార్డ్ సభ్యులు శీలం మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ కీసర గ్రామ శాఖ అధ్యక్షులు చినింగని బాల్‌రాజ్, కీసర శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ చైర్మెన్ తుడుం యాదగిరి, ప్రధాన కార్యదర్శి కుంటోళ్ళ సత్యనారాయణ, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, పూంద్రు కిష్టయ్య, అంబేద్కర్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి దాయర శ్రీనివాస్, మాజీ ఉపాధ్యక్షులు గంగి ఆంజనేయులు, చిత్రం రవి, పీపుల్స్ డైరీ రిపోర్టర్ తుడుం బాలకృష్ణ, కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ రాగుల రమేష్ ముదిరాజ్, తుడుం ఆగమయ్య, కుంటోళ్ళ ఆంజనేయులు, రాజలింగం ముదిరాజ్, కీసర గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర సాయిలు, పట్టా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులలో బాబాసాహెబ్ అంబేద్కర్ చింతన, జ్ఞానార్జన కృషిని ప్రోత్సహించడం ముఖ్య లక్ష్యంగా నిలిచింది.





# నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక పూజలు

**వరంగల్,సెప్టెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాలపూర్ దేవరాజు కాలనీలో నవదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని తెలిపారు. స్త్రీ శక్తి ప్రాధాన్యతను చాటి చెప్పే ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యత, సౌహార్దం, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరపున అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజును డివిజన్ కార్పొరేటర్, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, జేబీఎం చైర్మన్ జున్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, కాసగొని జనార్ధన్ గౌడ్, గోడిశాల సంధ్య, పవన్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణకు గర్వకారణం

◆ **వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హసన్ పర్తి,సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56 వ డివిజన్ పరిధిలోని గోపాల్పూర్ కళ్ళు మండల జంక్షన్ వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు సొంత నిధులతో అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ గర్వకారణమైన వీర మూర్తి అని సామాజిక న్యాయం,స్వాభిమానం, సమానత్వం కోసం పోరాడిన గొప్పయోధుడని కొనియాడారు.ఆయన అడుగుజాడల్లో నడిచి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గోపాల్పూర్ జంక్షన్ లో ఏర్పాటు చేస్తున్న విగ్రహం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. సర్వాయి పాపన్న ఆలోచనలతో ముందుకు సాగితేనే నిజమైన గౌరవం చూపినట్టు అని ప్రజల ఆకాంక్ష మేరకు ఈ విగ్రహ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విగ్రహం చుట్టూ అందమైన పార్కు, సకల సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని పాపన్న గౌడ్ స్ఫూర్తితో సమాజంలో సమానత్వం, ఐక్యత,సాహస స్ఫూర్తి పెంపొందేలా కృషి చేస్తామని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి అడుగులోనూ ప్రజలతోపాటు ఉంటానని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్,జక్కుల రజిత, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు,గడ్డం శివరాం ప్రసాద్,గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్,స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్,మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ గోపాల్ చారికి ఎమ్మెల్యే ఘన సన్మానం

**వనపర్తి,సెప్టెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండల ఆంధ్రప్రభ దిన పత్రికకు సీనియర్ జర్నలిస్ట్‌గా కొనసాగుతున్న సూరంపల్లి గోపాల్ చారికు ఎమ్మెల్యే మేఘారెడ్డి శాలువా కప్పి ఘన సన్మానం చేశారు.

టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన గోపాల్ చారికి శనివారం రాత్రి వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘనంగా సన్మానం అందజేశారు. 30 ఏళ్లుగా ఒకే పత్రికలో ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజా సమస్యలపై గళం విప్పుతూ వచ్చిన గోపాల్ చారి సేవలను ఎమ్మెల్యే మేఘారెడ్డి అభినందించారు.



# స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ధర్మ సమాజ్ పార్టీ

◆ **వనపర్తి జిల్లా అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ**

**వనపర్తి,సెప్టెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల స్థానాల రిజర్వేషన్ల కేటాయింపు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లా ఎన్నికల సమీక్షా సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలు, మండలాల్లో బరిలో నిలబడనున్నట్లు వనపర్తి జిల్లా అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ ప్రకటించారు.

పార్టీ తరపున ప్రతి స్థానంలో బలమైన పోటీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల యుద్ధానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే వివిధ మండలాల ఎన్నికల ఇన్చార్జి బాధ్యతలు పార్టీ కీలక నాయకులకు కేటాయించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి బంకల ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాగ అశోక్, ఎల్లస్వామి, నత్తి సుధాకర్ మహారాజ్, ఈశ్వర్ మహారాజ్, మన్నెం నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.



# అచ్చంపేట జన గర్జన సభలో పాల్గొన్న వెల్టూర్ బిఆర్ఎస్ నాయకులు

**పెద్దమందడి, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో అచ్చంపేట లో నిర్వహించిన జన గర్జన సభలో పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సభలో గ్రామస్థులు, యువత, మహిళలు పాల్గొని కేటీఆర్ కు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గం నుండి భారీగా తరలి వెళ్లారు . ఈ సందర్భంలో నాయకులు మాట్లాడుతూ, అచ్చంపేట సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ హామీలను కేటీఆర్ ఎండగట్టారని, ప్రజల సమస్యలను ఈ సభ ద్వారా కేటీఆర్ ప్రత్యక్షంగా వివరించడం జరిగిందని తెలిపారు. మళ్లీ తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని బిఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లక్ సురేష్ కుమార్, పవన్ కుమార్ రెడ్డి, సాంబ యాదయ్య పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు – చట్టబద్ధతపై చర్చ

**మేడ్చల్ మల్కాజిగిరి, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**



కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీఓలతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటీసీలు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లకు ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

అయితే, ఈ నిర్ణయంపై రాజ్యాంగ నిపుణులు, ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక తీర్పుల్లో సమగ్ర కులవారీ సర్వే ఆధారంగా మాత్రమే రిజర్వేషన్లు అమలుచేయాలని స్పష్టంచేసిందని, కానీ ప్రభుత్వం ఎలాంటి డేటా లేకుండా, కేవలం ఎన్నికలను వాయిదా వేయడానికి ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపిస్తున్నారు."వ్యవస్థను నడుపుతున్నది డ్రామా కంపెనీ కాదు. కోర్టులు చట్టం ప్రకారమే పనిచేస్తాయి. మోసపూరిత ప్రకటనలతో ముందుకు వెళ్లలేరు" అని నిపుణులు వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష నేతలు కూడా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. "బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే మంత్రివర్గంలోనే రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదు? సమగ్ర సర్వే చేసి రిపోర్టుతో కోర్టులను కన్విన్స్ చేయండి. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు సాధ్యమైనది అలా చేసినందువల్లే" అని హితవు పలికారు. చిత్తశుద్ధితో ఎన్నికలు నిర్వహిస్తే ఎవరూ అడ్డుకోలేరని, చట్టాన్ని అపహాస్యం చేసే ప్రయత్నాలు ఆపాలని కోరారు.



## శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కార్పొరేటర్ మేకల సునీత

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్, వీణపాలి నగర్, వాణి నగర్ తదితర ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావుతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు

- ప్రతి కాలనీ, బస్తీల అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం.
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.



**హసన్ పర్తి,సెప్టెంబర్ 28 ( తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55,56వ డివిజన్ పరిధిలోని భీమారం గోపాల్పూర్ పలు కాలనీలలో అంతర్గత రోడ్లు,కాలువల నిర్మాణం కోసం సుమారు 3.70 లక్షల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీ అభివృద్దే ద్యేయంగా మౌలిక సదుపాయాలు, శుభ్రత,మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్ల వంటి అంశాల్లో ఎటువంటి లోటు పాటు లు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని వచ్చే ఎన్నికల నాటికి అన్ని డివిజన్లలో అభివృద్ధి పూర్తయ్యేలా కార్యచరణ రూపొందించామని తెలిపారు.గడిచిన కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అత్యవసర ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు, నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. విలీన గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రతి డివిజన్ లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేస్తామని నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్,జక్కుల రజిత వెంకటేశ్వర్లు,డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు,గడ్డం శివరాం ప్రసాద్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్ తదితరులు పాల్గొన్నారు.




## 1200 అమరుల త్యాగ ఫలితాన్ని గుర్తిస్తూ ఉద్యమకారుల ఘన పాదయాత్ర

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 గజాల స్థలాల అమలు కోసం వందలాది ఉద్యమకారులు ఆందోళన

**నాగారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ ఉద్యమంలో భాగంగా త్యాగం చేసిన 1200 పైగా అమరుల రక్త ఫలితాన్ని గుర్తు చేసుకుని, ఉద్యమకారులు ఆదివారం ఘనంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ నుండి ప్రారంభమై, నాగారం మున్సిపాలిటీ మీదుగా కీసర (గుట్ట) రామలింగేశ్వర స్వామి దేవస్థానం వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజక వర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. అలాగే, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి ఉద్యమకారులకు సంఘీభావం వ్యక్తం చేస్తూ పాల్గొన్నారు.పాదయాత్రలో నరేంద్ర రెడ్డి, యాదిరెడ్డి, సురేష్ రెడ్డి, రవి, నవీన్ చారి, రాము, తిరుపతిరెడ్డి తదితర ప్రముఖ ఉద్యమకారులు, వందలాది ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యమకారులు తెలంగాణ కోసం త్యాగం చేసిన అమరుల స్మృతిని గౌరవిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం 21 నెలలుగా అమలు చేయని 250 గజాల ఉచిత స్థలాల హామీ పై నిరసన తెలిపారు.అనుబంధ సమాచారం:ఉద్యమకారుల పాదయాత్రలో పాల్గొన్న ప్రతీ వ్యక్తి ఈ తెలంగాణ సాధనలో అమరుల చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యమ కార్మికుల హక్కుల పరిరక్షణపై స్పష్టమైన సంకల్పాన్ని వ్యక్తపరిచారు. ఈ పాదయాత్ర స్థానిక ప్రజల్లో గొప్ప మద్దతు పొందింది.







## రైతుల రుణమాఫీ తాత్కాలిక విరామం రైతులకు ఆశ్వాసం

**ఎంపీ ఈటల**

**ఘట్కేసర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘట్కేసర్ ఉమ్మడి మండల రైతు రుణమాఫీ సాధన సమితి 19 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను తాత్కాలికంగా విరమింపజేశారు. సమితి సభ్యులు గతంలో ప్రభుత్వ హామీలు ఇచ్చినా, రుణమాఫీ ఆచరణలో జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈటల రాజేందర్ ప్రకారం, "ఘట్కేసర్ సొసైటీ నుంచి ఒక్కరికి కూడా రుణమాఫీ జారీ కాలేదు. ప్రెస్ మీట్స్, సంబరాల కోసం మాత్రమే రుణమాఫీ చూపించబడింది. రైతులు జేఏసి గా 19 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి వారితో చర్చించాను. వారు చేయనని హామీ ఇచ్చారు ."రైతులు సచివాలయం దగ్గర ధర్నా కూడా నిర్వహించగా, ఆ సందర్భంలో కూడా ఆ అధికారులు తక్షణ చర్యలకు ఒప్పుకున్నారు. దీక్షను తాత్కాలికంగా విరమించడమే కాకుండా, రైతులతో మళ్లీ సమావేశమై సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని ఎంపీ తెలిపారు.రాజకీయ నేపథ్యం ప్రకారం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మునుపు ఈ ప్రాంతానికి ఎంపీగా ఉన్నప్పుడు రుణమాఫీ సమస్య పరిష్కరించబడలేదని, రైతులు ఇప్పటికీ ఇబ్బందిలో ఉన్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.రైతాంగానికి 8 కోట్ల రూపాయల రుణమాఫీ చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యమానికి కూడా సిద్ధమని హెచ్చరించారు.ఈ సందర్భంగా రైతుల ఆందోళనను తాత్కాలికంగా నిలిపి, హామీలు మరియు చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి ముందడుగు వేయడం ఈటల రాజేందర్ చర్యలుగా వ్యక్తమైంది.

## సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మహిళా సిబ్బందికి చీరల పంపిణీ

**మాజీ చైర్మన్ చంద్రారెడ్డి**

**నాగారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**





నాగారం మున్సిపాలిటీలో సత్యనారాయణ కాలనీ, ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామీ, శ్రీ షిర్డీ సాయిబాబా మరియు శ్రీ పోచమ్మ దేవస్థానంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఘనంగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం తాళ్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాళ్లూరి మంజుల మరియు శ్రీనివాస్ రావు యొక్క ముందస్తు సన్నాహక ప్రయత్నాల ద్వారా రూపొందించబడింది.

ఈ కార్యక్రమంలో నాగారం పురపాలక సంఘం మహిళా సిబ్బంది 45 మందికి మాజీ మున్సిపాలిటీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మరియు దేవస్థాన చైర్మన్ (శ్రీ సాయి సత్యనారాయణ సేవ సమాజం) అన్నంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా చీరలు అందజేయడం జరిగింది.దేవస్థాన కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో సక్రియంగా పాల్గొన్నారు. ఇందులో అధ్యక్షులు సుబ్రహ్మణ్య హరగోపాల్, మరియు సభ్యులు చంద్రశేఖర్, వాడపల్లి శ్రీనివాస్, ఉమశంకర్, పవన్ కుమార్, వేదవతి ముఖ్యంగా పాల్గొన్నారు. చీరల పంపిణీ కార్యక్రమం సామాజిక సేవకు ప్రతీకగా, మహిళల సౌభాగ్యాన్ని పెంపొందించడం, సమాజంలో ఆత్మీయత మరియు పరస్పర సహకారం స్ఫూర్తిని రవాణా చేయడం లక్ష్యంగా చేపట్టబడింది. దేవస్థాన కమిటీ సభ్యులు, ఫౌండేషన్ నిర్వాహకులు మరియు స్థానిక ప్రజల సహకారం ఈ కార్యక్రమాన్ని మరింత గౌరవప్రదంగా మార్చింది.స్థానికులు మరియు మహిళల సంఘం సభ్యులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా సమాజంలో సాంఘిక బాధ్యత, సహకారం మరియు దాతృత్వ భావనను పుంజేసే అవకాశం ఏర్పడింది.






## బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవం

- మహిళలలు బతుకమ్మ ఆడేందుకు చీరల పంపిణీ
- శ్రీ వాణి, వెల్టూర్ గ్రామం

**పెద్దమందడి,సెప్టెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం, వెల్టూర్ గ్రామంలో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామానికి చెందిన శ్రీవాణి భర్త వెంకటేష్ తో కలిసి తమ స్వంత ఖర్చుతో 20 మంది మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆమె అత్తమామలు తమ్మలి కృష్ణయ్య - తమ్మలి కొండమ్మ పేరుమీద చేపట్టడం విశేషం.

శ్రీవాణి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే పండుగ అని, ఈ సమయంలో మహిళలు అందంగా అలంకరించుకుని బతుకమ్మ ఆడటం ప్రతి గ్రామంలో ఆనందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఆమె చీరలను పంపిణీ చేసిన ఉద్దేశం కూడా మహిళలు ఒకే రకమైన చీరలు ధరించి బతుకమ్మ ఆడితే మరింత ఆకర్షణీయంగా, సమానమైన ఆత్మీయతతో పండుగను జరుపుకోవడం అని వివరించారు.

ఈ కార్యక్రమం మహిళల ఐక్యతను, గ్రామ సాంప్రదాయాలను ప్రోత్సహించడంలో కూడా ముఖ్య పాత్ర వహిస్తుంది. గ్రామ పెద్దలు, మహిళలు ఈ మంచి కార్యక్రమాన్ని అభినందిస్తూ, శ్రీవాణి సేవాభావాన్ని కొనియాడారు. బతుకమ్మ పండుగకు సాంస్కృతిక వైభవాన్ని పెంచే ఈ ప్రయత్నం గ్రామంలో మంచి స్ఫూర్తిగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు.

మహిళలకు చీరలను పంపిణీ చేసిన సందర్భంగా గ్రామ మహిళలు శ్రీవాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ 118వ జయంతి ఘనంగా యువతకు ఆదర్శప్రాయుడు


**కాప్రా, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**



భారత స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ 118వ జయంతి ఘనంగా ఉత్సవంగా జరుపుకుంది. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేయబడింది. భారీ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఆయనకు నివాళి ఘనంగా అర్పించబడింది.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సల్మాన్ బేగ్, కార్యదర్శి టి. సత్యప్రసాద్ ముఖ్యంగా పాల్గొని, "భగత్ సింగ్ 12 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ల చిన్న వయసులో ప్రాణాలు అర్పించారు. ఆయన దేశ భక్తి, సాహసం, విప్లవమూర్తి గుణాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తి కలిగిస్తాయి" అని చెప్పారు. అధ్యక్షులు భగత్ సింగ్ జననం 1907 సెప్టెంబర్ 28న, మరణం 1931 మార్చ్ 23న రాజ్ గురు, సుఖ్ దేవ్‌లతో కలిసి ఉరితీయబడి జరిగింది అని వివరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర అత్యంత ప్రభావశీలంగా నిలిచినందున దేశ ప్రజలు షహీద్‌గా గుర్తించారు. ఏఐవైఎఫ్ నేతలు మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడం, నేటి యువతలో దేశభక్తిని రగిలించడం, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వాడకం తగ్గించడం భగత్ సింగ్‌కు అర్పించగల నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసిన వారు, యువత భవిష్యత్తులో శ్రామిక హక్కులు, నైపుణ్యాలు సాధించేందుకు భగత్ సింగ్ స్ఫూర్తితో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, మోసిన్, సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు హరికృష్ణ, బ్రహ్మయ్య, ఉప్పల్ నియోజకవర్గ నాయకులు విజయ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# నాగారం గోపికృష్ణ కాలనీలో చండీయాగం దుర్గ భవాని దర్శనం

- మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోపి కృష్ణ కాలనీలో ఆదివారం రోజు ఘనంగా చండీయాగం మరియు దుర్గ భవాని అమ్మవారి దర్శన కార్యక్రమం జరిగింది. ఈ పుణ్యకార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొని, భక్తి పరమోదంతో దేవతల పూజలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, అన్నం రాజు సురేష్, కోకుట్ల కృష్ణారెడ్డి, రామక్కపేట రవీందర్ రెడ్డి, మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. భక్తులు వారి కుటుంబసభ్యులతో కలిసి దర్శనానికి వచ్చి, చండీయాగం ద్వారా పుణ్యప్రాప్తి సాధించారని తెలిపారు.కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు, భక్తులకు సౌకర్యాలను కల్పించి, పూజలు సజావుగా జరుగడానికి పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానికులకు సమాఖ్య, సాంప్రదాయపరమైన భక్తి భావాన్ని మరింతగా ఆరాటం కలిగించింది అని అధికారులు తెలిపారు.

# కవి గుర్రం జాషువా 130వ జయంతి సంస్మరణ సభ

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు కమలానగర్ ఆఫీస్ హాల్లో ప్రముఖ కవి నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఘన సంస్మరణ సభ నిర్వహించబడింది. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.సామాజిక ఉద్యమ నేత జయరాజు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎం. భాస్కర్ రావు ప్రసంగంలో గుర్రం జాషువా జీవిత విశేషాలను వివరించారు. జయరాజు మాట్లాడుతూ, గుర్రం జాషువా కష్టాలను ఎదుర్కొని, కుల వివక్షకు వ్యతిరేకంగా నిలబడిన ధైర్యాన్ని వివరించారు.గుర్రం జాషువా



రచనలు కుల వివక్షను ఎదుర్కోవడంలో ప్రజల ఐక్యతను, పోరాటాలను ప్రతిబింబిస్తాయని, ముఖ్యంగా "గబ్బిలం" కవితలో శివుని పట్ల భక్తి భావాన్ని అద్భుతంగా వ్యక్తం చేశారని చెప్పారు. భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ అవార్డు ఇచ్చింది. సభలో శివ నారాయణ గుర్రం జాషువా రచించిన పద్యాలను రాగయుక్తంగా పాడి కార్యక్రమాన్ని మరింత సజీవంగా చేశారు. కృష్ణమాచార్యులు 100 సంవత్సరాల క్రితం గుర్రం జాషువా చేసిన కుల వివక్షకు వ్యతిరేక పోరాటం, నేడు కూడా వివిధ రూపాల్లో కొనసాగుతున్న కుల వివక్షపై జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని గుర్తు చేశారు. గోవిందరావు హాస్యప్రధాన వ్యాఖ్యలతో సభలో ఉల్లాసం చేర్చారు.
మరియు మల్లేశం, కోమటి రవి, ధరణి పత్రికా ఎడిటర్ రోజా రాణి, గుమ్మడి హరి ప్రసాద్, గద్దల నరసింహారావు తదితరులు ప్రసంగించారు. కవి దిగ్గజాలు విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా సూటి మాటలు వినిపిస్తూ సభను మరింత ఆనందింపజేశారు.
సభ ముగిసిన తర్వాత, సభ్యులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్థసారథి, ప్రభాకర్, హెచ్.వి. స్వామి, శ్రీనివాసరావు, గద్దల నరసింహారావు, గోపి, కృష్ణమాచార్యులు, రోజా రాణి, భాస్కర్ రావు, గోవింద రావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానాన్ని తొలగించుకోవడం, అన్యాయంపై పోరాడటమే దైవత్వం

- మీలోని దేవుడ్ని మేల్కొలపండి
- సాటి మనిషికోసం పాటుపడేవాడే దేవుడు
- మతోన్మాదం మానవత్వాన్ని మింగేస్తుంది
- మనుషుల్ని ద్వేషించే వాళ్ళు దెయ్యాలు
- బోనకల్ స్టడీ సర్కిల్ లో పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు:**

అజ్ఞానాన్ని పారద్రోలి అన్యాయంపై పోరాడటమే దైవత్వం అని ప్రతి మనిషి మనసులో దేవుడున్నాడని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. బోనకల్ సిపిఎం కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్ లో ఎవరు దేవుడు అనే అంశంపై మాట్లాడారు. సహాయం చేసిన మనుషులు గురించి చెబుతూ సమయానికి దేవుడిలా వచ్చాడనడం వింటుంటాం అన్నారు. ఆపదలో ఉన్నవారికి సహాయపడే గుణం కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ దేవుడే అన్నారు. ఏ మనిషి అయినా ఎప్పటికైనా ఇతరుల సహాయం లేకుండా జీవించలేరనీ కనుక శ్రమతో వస్తు సంపదను సృష్టించడం, ప్ర




కృతిని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయడం వల్ల ప్రతి మనిషి దేవుడిగా ఎదగొచ్చన్నారు. ఎదుటి మనిషిని ద్వేషించడం, దోచుకోవడం మనిషిలోని దెయ్యం చేసే పని అన్నారు. మనిషిలోని రాక్షసత్వాన్ని, మృగత్వాన్ని, అజ్ఞానాన్ని పారద్రోలాలంటే విజ్ఞానం పెంచడం ద్వారా మాత్రమే సాధ్యం అన్నారు. ఎవరు దేవుడు అని వెతికి మనిషి లోనే దివ్యత్వం ఉందని తేల్చి చెప్పిన స్వామి వివేకానంద మాటలను గుర్తించాలని కోరారు. విగ్రహాలలో దేవుడు లేడన్నారు. విశ్వానికి సృష్టికర్త లేడని ఉంటే ఒక్కరే ఉండాలి కదా? ఇన్ని మతాలు, ఎందరో దేవుళ్ళు ఎలా ఉంటారో తేల్చాలి అన్నారు. దీనిని బట్టే మనుషులే దేవుళ్ళను, మతాలను సృష్టించారని అర్థం అవుతుందని తెలిపారు. అజ్ఞానం నుండి ఆవిర్భవించిన అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు వివిధ రకాలుగా మతం ప్రయత్నం చేసిందన్నారు. ఈ సందర్భంగా పూజారి వర్గం చెప్పిన, చెబుతున్న అసత్యాలు, దోపిడికి సాధనంగా పనికి వచ్చే అంశాలను మనసులో నుంచి తొలగించాలన్నారు. మతాచారాలలో పనికి వచ్చే అంశాలను కొనసాగించడం లేదా ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలన్నారు. పూజారులకు రోగం వస్తే ఆసుపత్రులకే వెళ్తారని డాక్టర్లే వైద్యులవుతారని అన్నారు. మానవత్వంను మించిన మతం లేదని మతోన్మాదం మానవత్వాన్ని చంపేస్తుందన్నారు. మనిషిని మనిషి సంపూర్ణంగా విశ్వసించే పరిస్థితులు వచ్చినప్పుడు మతం అది సృష్టించిన దేవుళ్ళు అంతర్ధానం అయి మనిషే దేవునిగా అంటే ఉన్నతుడిగా ఎదుగుతాడన్నారు. అలాంటి పరిస్థితులకోసం మనసున్న మనుషులంతా సమైక్యంగా పోరాడాలని కోరారు. సిపిఎం మధిర డివిజన్ నాయకులు బంధం శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ స్టడీ సర్కిల్ లో సిపిఎం జిల్లా నాయకులు చింతల చెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షులు జొన్నలగడ్డ సునీత, డాక్టర్ కృష్ణవేణి, పి.వి.అప్పారావు, అప్పాచారి, మురళీ, బోయినపల్లి పున్నయ్య, చలమల హరికిషన్ రావు, అజెయ్ కుమార్, కుక్కల కోటేశ్వరరావు, గుగులోతు నరేష్, బోయినపల్లి కొండ, చేపూరి వెంకటేశ్వర్లు, గండు సైదులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్త జంటకు ఎంపీ వద్దిరాజు దంపతుల ఆశీర్వాదం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;**

ఖమ్మం జిల్లా సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణ, అరుణ కుమారి దంపతుల ప్రథమ పుత్రుడు ఆకుతోట అన్వేశ్ వివాహ నిశ్చితార్థ వేడుక ఆదివారం సాయంత్రం జరిగింది. మేడ్చల్ జిల్లా వాసి ఎద్దుల సునీల్‌రెడ్డి, భారతిరెడ్డి దంపతుల ప్రథమ పుత్రిక విదితారెడ్డితో మియాపూర్‌లోని సునీల్‌రెడ్డి స్వగృహంలో జరిగిన ఈ నిశ్చితార్థానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు హాజరై ఆశీర్వదించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సాదుల సారంగపాణితో పాటు ఇరు కుటుంబాల సన్నిహితులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.



# విశ్వ నరుడు

పడవ పడచు కు
పుట్టాడువ్యాసుడు!
మాదిగమగువ కు
పుట్టాడుజాషువా!
కులంతో పనిలేదని
ఋజువుచేసాయి
ఇద్దరి పుట్టుకలు!
ఇంకాకులాలను
పట్టుకుపడుస్తారా!
ఏడిస్తేఏడవండి!!

కవికోకిలకు
'గబ్బిలం'తోపని!
'గిజిగాడు'గూడు
నిర్మాణంలో
శ్రమజీవి ప్రతిభ!
'శ్మశాన వాటిక'
అగ్నికీలల్లో
మందభాగ్యుల
సమానత్వ
సిద్ధాంతం!!

జాషువా కవిత్వం
కరుణ రసాత్మకం!
హైందవనాగరాజు
బుసలకులొంగని
ఆత్మబలసంపన్నం!
ప్రజలనాలుకల పై
జీవించిన సుకవి!
జాషువా!వారెవా!!

అవమానాలచోట
సన్మానాలుపొంది
కవిదిగ్గజానివై
రాణించావు!
సత్కవీంద్రుడి
కమ్మనికలము
అరిగిపోలేదు
కరిగిపోలేదు!
ప్రతిభ పొంగి
వెలిగిపోయింది!!

హేమలత కు
లవణబంధం!
అస్పృశ్యత
అంటరానితనం
పురాణాల్లో కూడా
ఎక్కడాలేనిది!
ఇది చూసి కూడా
బుద్ధిహీనుల
కొనసాగింపు!
ఎందుచేత??

శక్తివంతులకు
ఆటంకంలేదు!
కులం లేదు
మతం లేదు!
నిజమే! నువ్వు
విశ్వ నరుడవు!
విశ్వకవివి!
నీజన్మధన్యం!
నీలోనిస్పృజన
అసామాన్యం!!

(గుర్రంజాషువా127వ జయంతి)

(హేమలత జాషువా గారికుమార్తె!లవణం గో.రా గారికుమారుడు వారిది కులాంతర వివాహం)

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్
28-9-2022

# గ్రామాల్లో శాంతియుతంగా దసరా పండుగ జరుపుకోవాలి

**-ధర్మసాగర్ సీఐ కే.శ్రీధర్ రావు**

**ధర్మసాగర్,సెప్టెంబర్28 (తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీధర్ రావు శాంతి భద్రతల పట్ల అప్రమత్తంగా వ్యవహరించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ధర్మసాగర్ మండల పరిధిలోని గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే బతుకమ్మ, దసరా పండుగల సమయంలో ప్రజలు సౌహార్ద్ర వాతావరణంలో పాల్గొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు.
సాంస్కృతిక పండుగలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని గుర్తుచేసిన సీఐ, వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు తమ గ్రామాల్లో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటారని, కానీ ప్రజల సహకారం ఉంటే పండుగలు మరింత సాఫీగా సాగుతాయని ఆయన స్పష్టం చేశారు.
అలాగే అక్టోబర్ 2న జరగబోయే గాంధీ జయంతి సందర్భంగా ఎలాంటి జీవహింస చేయకూడదని, గాంధీ ఆచరణలో చూపిన అహింస సూత్రాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్‌లో పండుగలు శాంతియుతంగా, సాంస్కృతిక వాతావరణంలో జరిగేలా పోలీసు విభాగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని సీఐ శ్రీధర్ రావు తెలిపారు.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## మృతిని కుటుంబానికి ఆర్థికసాయం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న దాదే వెంకట శివనగరాజు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదం తో మరణించడంతో వారి కుటుంబానికి తన తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. ఖమ్మం జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారికి 20వేల రూపాయలు అందజేసారు. ఈ సందర్భంగా మృతిని కుటుంబానికి పరామర్శించి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ గుండెపోగు నరేష్, వైస్ ప్రెసిడెంట్ యం. వినయ్ కుమార్, ట్రెజరర్ వంకాయల నవీన్,రమేష్, ఉపేందర్, గోపాల్,మరియు ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు



## బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో

- **హిస్సా-ఇజ్జత్ హుకుమత్ పుస్తకావిష్కరణ ఎంపీ ఈటెల రాజేందర్**

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఈతర సమాజాల సమస్యలపై అవగాహన పెంచే ప్రయత్నంగా "హిస్సాఇజ్జత్హుకుమత్" పుస్తకావిష్కరణను ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిధిగా పాల్గొని పుస్తక రచయిత చిరంజీవి రచనలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "2005లోనే చిరంజీవి రాసిన ఈ పుస్తకాల గురించి నేను సుదీర్ఘంగా మాట్లాడాను. అప్పట్లో నోముల నర్సింహయ్య ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రతీ సమావేశంలో కులవృత్తులు, చేతివృత్తులపై చర్చలు జరుగుతాయి. మనం మాట్లాడితే వినరు, కనీసం ప్రశ్నలు అడగాలి" అని తెలిపారు.అతని వ్యాఖ్యల ప్రకారం, "మన బీసీ సమాజం 58 శాతం ఉన్నప్పటికీ, 100 శాతం విజయాన్ని సాధించే అవకాశం ఉందని మనం గుర్తించలేకపోతున్నాం. భారత దేశ చరిత్రలో 40 శాతం ఓట్లు వచ్చినా అధికారంలోకి రావచ్చని తెలుసుకున్న తర్వాత, ఆ చైతన్యం ఎక్కడ కొరువబడింది అనేది మనం పరిశీలించాలి"



అని పేర్కొన్నారు.
చదువులు, అవగాహన పెరుగుతున్నప్పటికీ, ప్రతి ఇంట్లో చదువుకున్నవాళ్లు ఉన్నా కూడా ఎందుకు నిజమైన అవగాహన, అనుసరణ, ఆచరణ సాధించలేకపోతున్నారు అనే ప్రశ్నను ఈటల రాజేందర్ అడిగారు. ఆయన ఆగమనంగా, "రాజకీయాలను ఇప్పటికీ డబ్బే ప్రభావితం చేస్తోంది. సంఘాలు ఉన్నా అవి పూర్తిగా రాజ్యాధికారం సాధించగలవో తెలియదు. కానీ గుర్తింపు, గౌరవం కోసం సంఘాల అవసరం ఉంది" అని చెప్పారు. ఈటల రాజేందర్ పార్టీ లేదా స్థానాన్ని సంబంధం లేకుండా దోపిడీ, అనుచివేత, హక్కుల సమస్యలపై తప్పక మాట్లాడతానని స్పష్టం చేశారు. అలాగే, "చిరంజీవి రాసిన ఈ పుస్తకం కొంతమందిలో అయినా ఐక్యతను తెస్తుంది" అని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో బండ్ ప్రకాష్, ఈశ్వరయ్య, బాలరాజు, వెంకన్న తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ పుస్తకావిష్కరణ బీసీ సమాజానికి చైతన్యం, ఐక్యతను అందించే అవకాశం కాబట్టి, ఇది ప్రత్యేకమైనది అని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.



## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

- **తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్**

**హనుమకొండ,సెప్టెంబర్28 (తెలంగాణ ముచ్చట్లు):**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీ కులాల వారీగా సీట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ గోపాలపూర్ వినాయక కాలనీలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కృషి చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూనే, ఇంతవరకు అవకాశాలు రాని బీసీ కులాలకు సీట్లు ఇవ్వాలని ఆయన కోరారు. కుల గణనలో 56 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, దానికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించడంతో పాటు సాధారణ స్థానాల్లో కూడా బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలన్నింటినీ (కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ సహా) ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూతనకంటి ఆనందం, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేశబోయిన సాంబయ్య యాదవ్, గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకుడు బర్కం రామ్మోహన్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర సహాయ కార్యదర్శి కలకోట శ్రీధర్, దంచనాల రవీంద్ర చారి, బొల్ల మురళి యాదవ్, బాలోజు రవీంద్ర చారి, వడ్డేపల్లి సాధానందం, బాలోజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.





# బతుకమ్మ - ప్రకృతి పూల పండుగ



ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి దశమి వరకు ఉన్న పవిత్ర దినాలే శరన్నవరాత్రులు. ఇవి నవ చైతన్యాన్ని ప్రబోధించి, మానవుల్లోని సాత్త్విక భావాల్ని, జాగృతం చేసి, ధర్మ కార్యాచరణ వైపు మార్గం చూపుతాయి. ఆశ్వయుజ మాసం నుండి ఫాల్గుణ మాసం వరకు ఉన్న ఆరు మాసాల కాలంలో స్త్రీ రూపాత్మకమైందని ఆర్య ఋషులు చెప్పారు. అందుకే శక్తి రూపిణియైన అమ్మవారి ఆరాధనలతో దేవి నవరాత్రులు ప్రారంభమవుతాయి. నవరాత్రుల్లో వివిధ రూపాలైన శక్తి స్వరూపిణిని పూజించి పదవరోజున విజయదశమి ఉత్సవాల్ని నిర్వహిస్తారు.
తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంబరంబతుకమ్మ పండగ, దసరా నవరాత్రుల సమయంలో బతుకమ్మ ఉత్సవాలను వైభవోపేతంగా జరుపు కుంటారు. ఏటా భాద్రపద బహుళ అమావాస్య (మహాలయ అమావాస్య) నుంచి విజయదశమి వరకూ తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాల నడుమ తెలంగాణ ప్రాంత మహిళలు ఈ పండగను ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.
ఈ తొమ్మిది రోజుల్లో తమ ఇళ్ల ముంగిట రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది పూజలు చేస్తారు. బతుకమ్మ అలంకరణలో తంగేడు పూలది ప్రత్యేక స్థానం. చామంతి, గునుగు, జాజి, బంతి, జిల్లేడు, బీర, రుద్రాక్ష, గడ్డి పూలతో పాటు పలురకాల పూలను వినియోగిస్తారు. వెడల్పుగా ఉన్న పళ్లెంలో మారేడు ఆకులు వేసి వాటిపై పూలను గోపురం ఆకారంలో తీర్చిదిద్ది బతుకమ్మలను తయారుచేస్తారు. పూలను వలయాకారంలో పేర్చాక, శిఖర భాగంలో గుమ్మడి పూలను ఉంచుతారు. ఈ పూల గోపురాన్నే బతుకమ్మగా భావిస్తారు. పూలమధ్య తంగేడు పూల రెక్కలు పరిచి, తమలపాకులు పెట్టి కుంకుమ బొట్లతో అలంకరించిన పసుపు గౌరమ్మలను ఇంటి ముందు ఉంచి దీపాలు వెలిగిస్తారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన పీటపై ముగ్గు వేసి బతుకమ్మను ఉంచి స్త్రీలు ఆనందోత్సాహాల నడుమ లయబద్ధకంగా ఉయ్యాల పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతారు. బతుకమ్మకు సద్దుల నివేదన ముగిసిన అనంతరం తమ కోర్కెలు తీర్చాలని మహిళలు మనసారా మొక్కుకుంటారు. ప్రతినిత్యం తమ సంసారాలను కాపాడుతూ, సకల సౌభాగ్యాలను ప్రసాదించాలని గౌరమ్మను మహిళలు ప్రార్థిస్తారు.

**ఒక్కో పువ్వేసి చందమామ..**



సాయంత్రం వేళ ఇళ్ల ముంగిట బతుకమ్మలను ఉంచి మహిళలు చేసే సందడిలో పాటలదే పైచేయిగా కనిపిస్తుంది. ఉత్సాహంగా చప్పట్లు చరుస్తూ 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ లయబద్ధంగా అడుగులు వేసి, జానపద, సామాజిక పాటలు పాడతారు. ఆటపాటలు ముగిశాక గౌరీ దేవిని స్తుతిస్తూ బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ సంబరాలకు ముందు 'బొడ్డెమ్మ పండగను జరుపుతారు. బొడ్డెమ్మను బతుకమ్మ బిడ్డ అని భావిస్తారు. బతుకమ్మ పాటలు జానపద సంప్రదాయాల్ని గుర్తుకు తెస్తాయి. ఈ పాటల్లో చందమామ, ఉయ్యాల, కోలు, గౌరమ్మా వంటి పదాలు విధిగా ఉంటాయి. పల్లెసీమల్లో పొలం పనులు చేసు కుంటూ మహిళలు తమ కష్టాన్ని మరచిపోయేందుకు పాడే పాటలు బతుకమ్మ వేడుకల్లో వినిపిస్తాయి. ఒకప్పుడు తెలంగాణ ప్రాంతంలో ప్రకృతి బీభత్సాలు, అంటు వ్యాధులు, కరవు కాటకాలు వచ్చినప్పుడు అందరినీ కాపాడే అమ్మ 'బతుకమ్మ' అని భావించి మహిళలు ఈ పండగను ఆచరించడం మొదలుపెట్టారని పెద్దలు చెబుతారు. గృహిణులు తామ దీర్ఘ సుమంగళిగా ఉండాలని, యువతులు, తమకు మంచి భర్తలు లభించాలని గౌరీదేవిని ఆరాధిస్తారు. బతుకమ్మ సంబరాల్లో శ్రమజీవుల పాటలతో పాటు అత్తాకోడళ్ల పాటలు, పురాణ స్త్రీల కథలను వివరించే పాటలు పాడతారు. పాటలే కాదు, బతుకమ్మకు ప్రీతికరమైన నైవేద్యాలను సమర్పించడంలోనూ మహిళలు పోటీ పడతారు. గోధుమ, సజ్జ, బెల్లం, పెసర్లు, నువ్వులు ముద్దగా దంచి తయారుచేసిన వంటకాలను బతుకమ్మలకు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ తర్వాత ఈ నైవేద్యాన్ని అందరికీ పంచిపెడతారు. ఎలాంటి భేద భావాలు కనిపించక పోవడం బతుకమ్మ సంబరంలో మరో గొప్ప విశేషం. అంతా సమానమేనన్న భావన ఈ పండగలో ప్రతిఫలిస్తుంది. పేద, గొప్ప అనే తారతమ్యాలు గానీ, కులాల పట్టింపులు గానీ కనిపించవు. ఏ కులానికి చెందినా, పేద వర్గాలకు చెందినా గొప్పగా పాటలు పాడే మహిళలను ఆధరిస్తారు.

**పురాణ గాథలెన్నో..**

రాక్షసుడైన మహిషాసురుడిని వధించే సమయంలో దుర్గా మాత సొమ్మసిల్లి పడిపోగా, స్త్రీలు ఆమెను 'బతుకమ్మా..' ' బతుకు అమ్మ... అని పాటలు పాడి మేల్కొలి పారన్నది పురాణ కథనం. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి రోజున ఈ సంఘటన జరిగింది గనుక ఏటా అదే రోజున బతుకమ్మ పండగను ఆచరించడం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతుంటారు. శ్రీ మహాలక్ష్మీ మాత బతుకమ్మగా అవతరించిందని భక్తుల నమ్మకం. ఈ పండగపై మరో పురాణ గాథ కూడా ప్రచారంలో ఉంది. చోళ దేశాధిపతి అయిన ధర్మాంగుడు, అతని ధర్మపత్ని సత్యవతి సంతానం కోసం తపస్సు చేయగా లక్ష్మీదేవి ప్రత్యక్షమై వారి ఇంట జన్మిస్తానని వరమిచ్చిందట. ఈ దంపతులకు అంతకు ముందు పుట్టిన నూరుగురు కుమారులు యుద్ధంలో మరణించారని, ఈ కారణంగానే తమ కుమార్తె నిండు నూరేళ్లు జీవించాలని "బతుకమ్మ" అని పేరు పెట్టారని చెబుతారు యుక్త వయస్సు వచ్చాక వేరే కుమార్తెను చక్రాంకుడనే రాజు రూపంలో వచ్చి శ్రీమహావిష్ణువు పెళ్లాడినట్టు పురాణ గాథ.
తొమ్మిది రోజులపాటు కోలాహలంగా జరుపుకునే బతు కమ్మ ఉత్సవాలు దుర్గాష్టమి రోజున పరిసమాప్తమవుతాయి. ఈ సంబరంలో ప్రధానమైనది చివరి రోజున జరిగే 'సద్దుల 'బతుకమ్మ' ఉత్సవం. పల్లెల్లో అయితే ఈ సందర్భంగా చెరువు నుంచి మట్టిని తెచ్చి ఇంటి ముందు ఒక గద్దెలా వేసి దానిపై వెంపలి మొక్కను నాటుతారు. మహిళలు బతుకమ్మలను, సద్దులను తీసుకుని వచ్చి ఆ మొక్క చుట్టూ వలయాకారంలో అమరుస్తారు. వయో భేదం లేకుండా మహిళలు ఉత్సాహంగా అడుగులు వేస్తూ ఉయ్యాల పాటలు పాడతారు. పాటలు పాడడం ముగిసాక బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తూ 'పోయి రావమ్మ గౌరమ్మా' అని అంతా గళం కలుపు తారు. పసుపు కుంకుమలను, సద్దులను మహిళలు పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటారు. ఇది ఐక్యతా భావానికి ప్రతీకగా నిలు స్తుంది. బతుకమ్మల నిమజ్జనం సమయంలో చెరువు నీళ్లపై మనోహర దృశ్యాలు ఆవిష్కృతమవుతాయి. కాంతులీనే తారలతో చీకటి వేళ ఆకాశం ఎంత అందంగా కనిపిస్తుందోరంగురంగుల బతుకమ్మలతో, దీపాలతో చెరువులన్నీ కమనీయ దృశ్యాలకు వేదికలవుతాయి.
బతుకమ్మ అంటే పార్వతి అని, ఆమెకు పూలంటే ఎంతో ప్రీతిపాత్రం కనుక మహిళలు వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందుకే ఇళ్లముంగిట పూల పరిమళాలు గుబాళి స్తాయి. ఈ పండగలో జానపద కళలకు పెద్ద పీట వేయడం కనిపిస్తుంది.



**- ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్,**
**ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్**
**కావ్యసుధ**
**హయత్ నగర్,హైదరాబాదు.**

## ఎస్టీ జాబితా నుండి లంబాడీల తొలగింపు డిమాండ్‌పై అన్ని పార్టీల వైఖరి స్పష్టం చేయాలి

- లంబాడి జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్‌జేఏసీ)
- మహబూబాబాద్‌లో లంబాడీల ఆత్మగౌరవ సభలో జాటోత్ కిషన్ నాయక్, జైసింగ్ రాథోడ్ వ్యాఖ్యలు
- కోయ నాయకుల రాజ్యాంగ విరుద్ధ డిమాండ్‌పై మౌనం వీడాలని అన్ని పార్టీలకు పిలుపు
- స్పష్టమైన వైఖరి చెప్పని నేతలు ఆత్మగౌరవ సభలలో పాల్గొనవద్దని సూచన
- త్వరలో ఐదు లక్షల మంది పాల్గొనే 'చలో హైదరాబాద్' ఆత్మగౌరవ సభ ఏర్పాటు

**మహబూబాబాద్,సెప్టెంబర్28 (తెలంగాణ ముచ్చట్లు):**

లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే డిమాండ్‌పై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని లంబాడి జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్‌జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ జాటోత్ కిషన్ నాయక్, జైసింగ్ రాథోడ్ డిమాండ్ చేశారు.
మహబూబాబాద్ కేంద్రంలో జరిగిన లంబాడీల ఆత్మగౌరవ సభలో వారు మాట్లాడుతూ, కొద్దిమంది కోయ నాయకులు రాజ్యాంగ విరుద్ధంగా చేస్తున్న డిమాండ్‌పై మౌనం వీడాలని, ప్రతి పార్టీ లంబాడీలకు మద్దతు ప్రకటించాలని సూచించారు. పార్టీలలో ఉన్న లంబాడి ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు తమ పార్టీల అధిష్టానాన్ని బలవంతపెట్టి లంబాడీలపై స్పష్టమైన వైఖరి చెప్పేలా చూడాలని పిలుపునిచ్చారు.లేకపోతే, లంబాడి ఆత్మగౌరవ సభల నుండి వారు దూరంగా ఉండడం మంచిదని స్పష్టం చేశారు. లంబాడీలను ఐక్యం కాకుండా విభజించే ప్రయత్నాలను ఎల్‌జేఏసీ తీవ్రంగా ఖండించింది. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలలో ఏర్పాట్లు పూర్తి చేసి, ఐదు లక్షల మంది పాల్గొనే 'చలో హైదరాబాద్' ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జేఏసీ వరంగల్ జిల్లా నాయకులు అజ్మీర వెంకట్, లావుడియా రాజు నాయక్, బానోత్ భాస్కర్ నాయక్, మహబూబాబాద్ జిల్లా నాయకులు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, భానోత్ మంగీలాల్ నాయక్, అర్జున్ చౌహాన్, సునీల్ నాయక్, ధరావత్ కిషన్ నాయక్, దరావత్ జైసింగ్ నాయక్, బానోత్ మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







# ఆరోగ్యంగా ఉండాలంటే..!

మనమందరం శరీరం ఆరోగ్యంగా ఉండాలని, మనసు ఎప్పుడూ శక్తితో నిండి ఉండాలని కోరుకుంటాం. అయితే కొన్నిసార్లు ఉదయం మనం చేసే తప్పుడు అలవాట్ల వల్ల మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకుంటాము. అందుకే ఆరోగ్య నిపుణుల ప్రకారం.. ఫిట్‌నెస్ అనేది కేవలం జిమ్‌కు వెళ్లడం లేదా కఠినమైన వ్యాయామాలు చేయడం వరకే పరిమితం కాదు. కానీ మన ఆరోగ్యానికి ఉదయం అలవాట్లు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మీరు ఉదయాన్ని సరైన విధంగా ప్రారంభిస్తే రోజంతా శక్తి, ఉత్సాహం నిలిచి ఉంటాయి. ఉదయం త్వరగా నిద్ర లేవడం చాలా ప్రయోజనకరం. ఉదయం 5 నుండి 6 గంటల మధ్య లేవడం ఉత్తమ సమయం. ఈ సమయం శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడానికి, జీవక్రియను చురుకుగా ఉంచడానికి అత్యంత అనుకూలమైనది. ఆలస్యంగా లేవడం లేదా నిరంతరం బద్ధకించడం ఫిట్‌నెస్‌కు పెద్ద అడ్డంకిగా మారుతుంది. ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగడం చాలా అవసరం. ఇది మీ శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చాలా మంది దీనిని నిర్లక్ష్యం చేస్తారు. దీనివల్ల శరీరంలో నిస్సత్తువ, బరువు పెరగడం వంటి సమస్యలు వస్తాయి. ఉదయం సమయం తేలికపాటి వ్యాయామం లేదా స్ట్రెచింగ్ కోసం అత్యంత అనుకూలమైనది. ఇది కండరాలను బలోపేతం చేయడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, శరీరంలో చురుకుదనాన్ని కొనసాగించడానికి సహాయపడుతుంది. యోగా, నడక లేదా స్ట్రెచింగ్ మీ శరీరాన్ని రోజంతా చురుకుగా ఉంచగలవు. చాలా మంది ఉదయం జిమ్‌కి వెళ్లి భారీ వర్కవుట్‌లు చేస్తారు. కానీ స్ట్రెచింగ్ లేకుండా చేయడం కండరాలకు హానికరం కావచ్చు. ఉదయం అల్పాహారం రోజువారీ శక్తికి ఆధారం. చాలా మంది అల్పాహారాన్ని తేలికగా లేదా అసమతుల్యంగా తీసుకుంటారు. ఇది ఫిట్‌నెస్‌కు సరైనది కాదు. అల్పాహారంలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు ఉండటం అవసరం. ఓట్స్ (దలియా), గుడ్డు, వేరుశనగ లేదా తాజా పండ్లు శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. రోజంతా శక్తిని నిలిపి ఉంచుతాయి. ఫిట్‌నెస్ అనేది కేవలం శరీరానికే పరిమితం కాదు. మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఉదయం ధ్యానం (మెడిటేషన్) చేయడం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది.



## పీరియడ్స్ టైంలో తలస్నానం చేస్తే ఏమవుతుంది?

పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదని చాలా మంది అంటుంటారు. అందుకే చాలా మంది ఈ సమయంలో తల స్నానం మానేస్తారు. అయితే దీని వెనుక నిజంగా ఏదైనా కారణం ఉందా? పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదని చాలా మంది అంటుంటారు. అందుకే చాలా మంది ఈ సమయంలో తల స్నానం మానేస్తారు. అయితే దీని వెనుక నిజంగా ఏదైనా కారణం ఉందా? అనే విషయం ఇక్కడ తెలుసుకుందాం. నిజానికి చాలా ఇళ్లలో ఇప్పటికీ పీరియడ్స్ సమయంలో స్త్రీలను వంటగదిలోకి కూడా అనుమతించరు. ఇలాంటి దురాచారాలు మన దేశంలో వేళ్లూనుకుపోయాయి. వీటిని అంత తేలిగ్గా వదిలించుకోవడం మన సమాజంలో సాధ్యంకాదు. ఇలాంటి అపోహల్లో పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదు అనేది ఒకటి. అందుకే చాలా మంది మహిళలు ఈ సమయంలో తల స్నానం చేయరు. కొందరు అసలు స్నానం కూడా చేయరు. నిజానికి పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత చాలా అవసరం. పీరియడ్స్ సమయంలో ఎంత ఎక్కువ పరిశుభ్రతను పాటిస్తే అంత మంచిది. పీరియడ్స్ సమయంలో ప్రతిరోజూ స్నానం చేయడం అస్సలు మర్చిపోకూడదు. పీరియడ్స్ సమయంలో స్నానం చేస్తే శరీరం సాంత్వన పొందుతుంది. ఇది అసౌకర్యాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. రోజుకు రెండుసార్లు స్నానం చేయడం ఇంకా మంచిది.



## ఆరోగ్యం సంజీవని ఈ పండు..!

తియ్యగా, రసభరితంగా ఉండే పైనాపిల్ కేవలం రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యం, అందానికి కూడా ఒక వరం లాంటిది. వేసవి అయినా, చలికాలం అయినా ఈ పండు శరీరానికి శక్తిని, పోషణను అందిస్తుంది. అంతేకాకుండా ఇది చర్మం, జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తుంది. జుట్టు పెరుగుదలకు సహాయం: అనాస పండులో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు జుట్టు కుదుళ్లకు పోషణనిస్తాయి. దీనివల్ల జుట్టు పెరుగుదల వేగవంతమై, వెంట్రుకలు ఒత్తుగా, పొడవుగా పెరుగుతాయి. చర్మం కాంతివంతం: పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్, విటమిన్ సి చర్మంపై ఉండే మృతకణాలను తొలగించి, చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి. క్రమం తప్పకుండా తీసుకుంటే చర్మం పరిశుభ్రంగా, మెరిసేలా కనిపిస్తుంది. జీర్ణక్రియకు సహాయం: అనాస పండులో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపులో గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేయడంలో ఇది చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ పండు శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుండి రక్షణ పొందడానికి అనాస పండు ఎంతో ఉపయోగపడుతుంది. ఎముకల బలం: అనాస పండులో ఉండే మాంగనీస్ ఎముకల బలం, కీళ్ల ఆరోగ్యానికి అవసరం. క్రమం తప్పకుండా తీసుకుంటే ఎముకలు బలహీనపడవు.బరువు తగ్గడంలో సహాయం: ఈ పండు తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ కలిగి ఉంటుంది. దీనిని తినడం వల్ల ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. అనవసరంగా తినడం తగ్గుతుంది. గుండె ఆరోగ్యానికి: అనాస పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ గుండె జబ్బుల నుండి రక్షణ కల్పిస్తాయి. ఇది రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది.

## పింక్ సాల్ట్ - వైట్ సాల్ట్.. ఆరోగ్యానికి ఏది మంచిది..?



రెండిరటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్‌ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ఉప్పు మన ఆహారంలో ఒక ముఖ్యమైన భాగం. కూరగాయలు వండడానికి అయినా, సలాడ్‌లో చేర్చుకోవడానికి అయినా లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ రుచిని పెంచడానికి అయినా ఉప్పును ప్రతిదానిలో ఉపయోగిస్తారు. కానీ అదనపు ఉప్పు అంటే అదనపు సోడియం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ సోడియం తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. అందుకే సాధారణ ఉప్పు కంటే పింక్ సాల్ట్ మంచిదా? పింక్ సాల్‌ట్‌ను హిమాలయన్ సాల్ట్ అని కూడా అంటారు. ఈ ఉప్పును హిమాలయాలకు సమీపంలోని గనుల నుండి తీస్తారు. దాని గులాబీ రంగుకు కారణం దానిలో ఉండే ఐరన్ ఆక్సైడ్ వంటి ఖనిజాలు. పోషకాహార నిపుణురాలు హరి ప్రియ ఎన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఉప్పు ఎక్కువగా ప్రాసెస్ చేయరు. అందుకే ఇది మరింత సహజమైనదిగా పరిగణిస్తారు. సాధారణ ఉప్పు లేదా టేబుల్ సాల్ట్ సాధారణంగా ఉపయోగించే ఉప్పు. దీనిని ప్రాసెసింగ్ ద్వారా తయారు చేస్తారు. దీనిలో చాలా ఖనిజాలు తొలగిస్తారు. రెండూ ప్రధానంగా సోడియం క్లోరైడ్‌తో కూడి ఉంటాయి. పింక్ సాల్‌ట్‌లో 8498 శాతం, సాధారణ ఉప్పులో 9799 శాతం ఉంటాయి. రెండిరటినీ ఆహార రుచిని పెంచడానికి, ఆహారాన్ని నిల్వ చేయడానికి ఉపయోగిస్తారు. రెండిరటినీ అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. మూలం: సముద్రపు నీరు లేదా ల్యాండ్ మైన్‌లను ప్రాసెస్ చేయడం ద్వారా సాధారణ ఉప్పును తయారు చేస్తారు. అయితే పింక్ సాల్‌ట్‌ను హిమాలయాలకు సమీపంలోని ఉప్పు గనుల నుండి తయారు చేస్తారు. ప్రాసెసింగ్: సాధారణ ఉప్పు మరింత శుద్ధి చేస్తారు. దానికి అయోడిన్ జోడిస్తారు. పింక్ సాల్ట్ సహజమైనది. అలాగే శుద్ధి చేయరు. ఖనిజాలు: పింక్ సాల్‌ట్‌లో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి 84 కంటే ఎక్కువ ఖనిజాలు ఉన్నాయి (ఫుడ్స్ జర్నల్ ప్రకారం సమాచారం). రంగు, ఆకృతి: సాధారణ ఉప్పు తెల్లగా, సన్నగా ఉంటుంది. అయితే గులాబీ ఉప్పు పింక్ కలర్‌లో ఉంటుంది. మరి సన్నగా కాకుండా కొంత దొడ్డుగా ఉంటుంది. రుచి: సాధారణ ఉప్పు ఎక్కువ ఉప్పగా ఉంటుంది. అదే పింక్ సాల్‌ట్‌లో ఉప్పు తేలికపాటి , ఖనిజ రుచిని కలిగి ఉంటుంది. ఆరోగ్య ప్రయోజనాలు: క్రమం తప్పకుండా ఉప్పు తీసుకోవడం వల్ల అయోడిన్ లోపాన్ని నివారించవచ్చు. పింక్ సాల్ట్ హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌కు సహాయపడుతుంది.

ఇందులో ఏ ఉప్పు తీసుకోవాలి? రెండిరటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్‌ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి.. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.



## తరచుగా మోకాళ్ల నొప్పులు వస్తున్నాయా?

తరచుగా మోకాళ్ల నొప్పులు వస్తుంటే, దానిని తేలికగా తీసుకోకూడదు. ఇది అలసట లేదా వృద్ధాప్యం వల్ల మాత్రమే కాదు, అనేక తీవ్రమైన అనారోగ్యాలతో కూడా ముడిపడి ఉంటుంది. మోకాళ్ల నొప్పులు యువతలో కూడా సాధారణంగా మారిపోయాయి. ముఖ్యంగా ఎక్కువసేపు నిలబడేవారు, అధికంగా నడవడం లేదా అధిక బరువు ఉన్నవారిలో ఈ సమస్య కనిపిస్తోంది. ఎముకల బలహీనత, హార్మోన్ల మార్పుల కారణంగా ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. నొప్పి కొనసాగితే, అది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. వెంటనే దాన్ని తనిఖీ చేసుకోవడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది తీవ్రమవుతుంది, నడవడానికి ఇబ్బంది కలిగిస్తుంది. నిరంతర మోకాలి నొప్పి అనేక ఇతర లక్షణాలతో కూడి ఉంటుంది. వాపు, మోకాళ్లలో దృఢత్వం, మెట్లు ఎక్కడం కష్టం, నడుస్తున్నప్పుడు మోకాళ్లలో శబ్దం, నొప్పి కారణంగా నిద్రకు ఆటంకాలు ఏర్పడటం ఇవన్నీ తీవ్రమైన సమస్యను సూచిస్తాయి. కొంతమందికి మోకాళ్లలో మంట, వెచ్చదనం లేదా ఎరుపు కూడా ఉంటుంది, ఇది మంట లేదా ఇన్ఫెక్షన్ సంకేతం కావచ్చు. అందువల్ల, మోకాలి నొప్పిని విస్మరించకూడదు. ఎయిమ్స్‌లోని ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్ అయిన డాక్టర్ భావుక్ గార్గ్ ప్రకారం.. పదే పదే వచ్చే మోకాలి నొప్పి అనేక వ్యాధులతో ముడిపడి ఉంటుందని వివరించారు. దీనికి అత్యంత సాధారణ కారణం ఆస్టియో ఆర్థరైటిస్, దీనిలో ఎముకల మధ్య మృదులాస్థి క్షీణించడం ప్రారంభమవుతుంది, నొప్పి పెరుగుతుంది. ఈ పరిస్థితి వయస్సుతో పాటు ఎక్కువగా కనిపిస్తుంది, కానీ నేటి కాలంలో, జీవనశైలి, ఊబకాయం కారణంగా, ఇది యువతలో కూడా కనిపిస్తుంది. అదనంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది స్వయం ప్రతిరక్షక వ్యాధి, దీనిలో శరీర రోగనిరోధక వ్యవస్థ ఎముకలు, కీళ్లపై దాడి చేస్తుంది, దీని వలన మంట, నొప్పి పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో గౌట్ కూడా ఈ పరిస్థితికి కారణమవుతుంది, ఇక్కడ యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల కీళ్లలో స్ఫటికాలు ఏర్పడతాయి, దీనివల్ల తీవ్రమైన నొప్పి వస్తుంది. ఎముకలలో కాల్షియం లోపం, గాయం లేదా అధిక బరువు వల్ల కూడా తరచుగా మోకాలి నొప్పి వస్తుంది. చికిత్స చేయకపోతే, ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

## ఆయుర్వేద రారాజు అశ్వగంధ..



అశ్వగంధ ఆయుర్వేదంలో ముఖ్యమైన మూలిక. పురాతన ఔషధమైన అశ్వగంధ శరీరానికి, మనస్సుకు కూడా గొప్ప వరంగా చెబుతారు. కానీ, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన అశ్వగంధ కొందరు వ్యక్తులకు మాత్రం చాలా డేంజర్ అంటున్నారు. దీని వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయని అంటున్నారు. అశ్వగంధ ఆయుర్వేదంలో ముఖ్యమైన మూలిక. ఇది ఒత్తిడిని తగ్గించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, శారీరక శక్తిని పెంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. దాని వేర్లు గుర్రపు వాసన రావడం వల్ల దీనికి అశ్వగంధ అనే పేరు వచ్చిందని ఆయుర్వేదంలో ప్రస్తావించారు. పురాతన ఔషధమైన అశ్వగంధ శరీరానికి, మనస్సుకు కూడా గొప్ప వరంగా చెబుతారు. కానీ, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన అశ్వగంధ కొందరు వ్యక్తులకు మాత్రం చాలా డేంజర్ అంటున్నారు. దీని వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయని అంటున్నారు.అశ్వగంధ ఎంతో అద్భుతమైన మూలిక. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అనేక వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తుంది. కానీ అశ్వగంధ వినియోగం కొందరికి మాత్రం హానికరం అంటున్నారు నిపుణులు. తక్కువ రక్తపోటు ఉన్నవారు అశ్వగంధను తినకూడదు. ఇది రక్తపోటు మరింత తగ్గడానికి కారణమవుతుంది. గర్భిణీ స్త్రీలు కూడా అశ్వగంధను తినకూడదని వైద్యులు చెబుతున్నారు. హైపర్ థైరాయిడ్ రోగులు కూడా జాగ్రత్తగా ఉండాలి. అశ్వగంధ నిద్రను పెంచుతుంది. ఇది మందుల ప్రభావాన్ని పెంచుతుంది. కాబట్టి నిద్ర మాత్రలు తీసుకునేవారు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. అధిక మొత్తంలో దీనిని తీసుకోవడం వల్ల కడుపులో చికాకు లేదా విరేచనాలు సంభవించవచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు వీటిని తీసుకోకూడదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ బృందం పేర్కొంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తిలక్ షో..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆసియా కప్‌లో మూడు సార్లు పాక్‌ను చిత్తు చేసి మనకు ఎదురేలేదని భారత్ మరోసారి ఘనంగా చాటిచెప్పింది.

దుబాయ్: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అదిరే విజయం సాధించి భారత్ ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో దాయాది జట్టుపై టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బౌలర్లు విజృంభించడంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తిలక్ వర్మ (69*: 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (33: 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) చెలరేగాడు.

147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఈ టోర్నీలో సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ (5) రెండో ఓవర్ తొలి బంతికి ఔటయ్యాడు. ఫహీమ్ అష్రఫ్ బౌలింగ్ రవూఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సూర్య (1) షహీన్ అఫ్రిది బౌలింగ్‌లో సల్మాన్ అఘాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇక టీమ్ ఇండియా 20 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. ఫహీమ్ అష్రఫ్ బౌలింగ్‌లో నాలుగో ఓవర్ చివరి బంతికి రవూఫ్‌కు క్యాచ్ ఇచ్చి గిల్ (12) పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ నాలుగో ఓవర్లకు ముగిసే సరికి 25/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సంజూ శాంసన్ (24: 21 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. అడపాదడపా బౌండరీలతో వీరు స్కోర్‌బోర్డును ముందుకు కదిలించారు. 10 ఓవర్లకు భారత్ స్కోర్ 58 పరుగులుగా ఉంది. ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న తరుణంలో జట్టు స్కోర్ 77 పరుగుల వద్ద అబ్రార్ బౌలింగ్‌లో శాంసన్ క్యాచ్ ఔటయ్యాడు. దీంతో 52 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. శాంసన్ ఔటైన అనంతరం స్కోర్ కొంచెం నెమ్మదించింది. అయితే 15వ ఓవర్లో భారత బ్యాటర్లు జూలు విదిలించారు.

హారిస్ రవూఫ్ బౌలింగ్‌తో తొలుత దూబె ఫోర్ బాదగా అనంతరం తిలక్ వర్మ ఒక ఫోర్, సిక్స్ కొట్టాడు. దీంతో ఈ ఓవర్లో 17 పరుగులు వచ్చాయి. 15 ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్ 100/4తో నిలిచింది. 16వ ఓవర్ తొలి బంతికి దూబె సిక్స్ బాదాడు. ఈ ఓవర్లో చివరి బంతికి తిలక్ సింగిల్ తీసి అర్ధ శతకం నమోదు చేశాడు. ఈ ఓవర్లో మొత్తం 11 పరుగులు వచ్చాయి. దీంతో విజయ సమీకరణం 4 ఓవర్లలో 36 పరుగులుగా మారింది. 17వ ఓవర్లో కేవలం 6 పరుగులే రావడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే 18 ఓవర్ చివరి బంతికి దూబె సిక్స్ బాదాడు. దీంతో ఈ ఓవర్లో మొత్తం 13 పరుగులు వచ్చాయి. భారత్ విజయ లక్ష్యం 12 బంతుల్లో 17 పరుగులుగా మారింది. 19 ఓవర్లో చివరి బంతికి దూబె భారీ షాట్ కొట్టగా, షహీన్ అఫ్రిది బౌండరీ వద్ద క్యాచ్




అందుకున్నాడు. ఈ ఓవర్లో కేవలం 7 పరుగులే వచ్చాయి. దీంతో సమీకరణం 6 బంతుల్లో 10 పరుగులు మారింది. తొలి బంతికి రెండు పరుగులు రాగా, రెండో బంతిని తిలక్ సిక్స్‌గా మలిచాడు. నాలుగు బంతికి రింకు సింగ్ ఫోర్ కొట్టడంతో భారత్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

టాస్ గెలిచిన టీమ్‌ఇండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (57; 38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), ఫకార్ జమాన్ (46; 35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించడంతో దాయాది జట్టు భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ అయితే భారత స్పిన్నర్లు కీలక సమయంలో పాక్ టపాటపా వికెట్లు కోల్పోయింది. కుల్‌దీప్ యాదవ్ (4/30) ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. దీంతో పాక్ 19.1 ఓవర్లలోనే 146 పరుగులకు ఆలౌట్ అయ్యింది. వరుణ్ చక్రవర్తి, అక్షర్, బుమ్రా తలో రెండేసి వికెట్లు తీశారు. పాకిస్థాన్ ఓపెనర్లు ఫర్హాన్, ఫకర్ జమాన్ పవర్‌ప్లేలో నిలకడగా ఆడి వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేశారు. కాస్త దూకుడుగా ఆడి అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఫర్హాన్.. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన సైమ్ అయూబ్ (14) కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో 113 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే మహ్మద్ హారిస్ కూడా పరుగులేమీ చేయకుండా వెనుదిరిగాడు. ధాటిగా ఆడుతున్న మరో ఓపెనర్ ఫకర్ జమాన్ కూడా వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఔటయ్యాడు.




# ట్రైలర్ రిలీజ్ టైమ్ ఫిక్స్ !

కమర్షియల్ డైరెక్టర్ మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో ఓ భారీ పాన్ ఇండియా సినిమాని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఈ సినిమా అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే, ది రాజా సాబ్ ట్రైలర్‌ను సెప్టెంబర్ 29, 2025న సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ క్రమంలో ఒక పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ప్రభాస్ తో పాటు, ఈ సినిమాలో సంజయ్ దత్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ మరియు రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా జనవరి 9, 2026న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మొత్తమ్మీద మారుతి ఈ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన ఎలిమెంట్స్ ను సిద్ధం చేశాడట. అన్నట్టు ప్రభాస్ కి పూర్తిగా ఇది కొత్త జోనర్ అవుతుంది. కాగా ప్రభాస్ తో మారుతి సినిమా చేస్తే.. ఇక మారుతి రేంజ్ మారిపోయినట్టే.




# రామ్‌చరణ్ సినీ ప్రయాణానికి 18 ఏళ్లు

## 'పెద్ది' టీమ్ స్పెషల్ పోస్టర్ విడుదల

రామ్‌చరణ్ కథానాయకుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'చిరుత'తో వెండితెరకు పరిచయమైన ఆయన డ్యాన్స్‌లు, ఫైట్స్‌తో పాటు, 'రంగస్థలం' చిత్రంలో తనదైన నటనతో తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకుడు. జాన్వీ కపూర్ కథానాయిక.

రామ్‌చరణ్ వెండితెరకు పరిచయమై 18 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విషెస్ చెబుతూ 'పెద్ది' టీమ్ స్పెషల్ పోస్టర్‌ను పంచుకుంది. "మా 'పెద్ది' 18ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషం. తెరపై ఘనమైన వారసత్వం కొనసాగిస్తూనే బయట ఎంతో వినయ విధేయతలు కలిగి ఉండటమే కాకుండా, తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పాటు చేసుకున్నాడు. మాకెన్నో అద్భుతమైన ఉత్సాహాన్ని కలిగించే సందర్భాలను ఇచ్చాడు. 'పెద్ది' నుంచి చాలా పెద్ద సర్‌ప్రైజ్‌లు మొదలు కాబోతున్నాయి" అని పేర్కొంది.

శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ కథతో రానుంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న 'పెద్ది'లో కన్నడ నటుడు శివరాజ్ కుమార్‌తోపాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు. 'ఒకే పని సెసేనాకి... ఒకే నాగ బతికేనాకి... ఇంత పెద్ద బతుకెందుకు? ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసెయ్యాల... పుడతామా యేటి మళ్లీ!' అనే సంభాషణతో కొన్నిరోజుల కిందట విడుదల చేసిన ప్రచారం చిత్రం సినిమాపై అంచనాలను పెంచిన సంగతి తెలిసిందే. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.




# కాంతార:చాప్టర్1 నుంచి మరో పాట

కన్నడ నటుడు రిషబ్ శెట్టి హీరోగా వచ్చిన "కాంతార" చిత్రం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముఖ్యంగా 'కాంతార'లో 'వరాహరూపం..' పాట బాగా ఆదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు దాన్ని గుర్తు చేసేలా 'కాంతార:చాప్టర్ 1'లో మరో పాట సిద్ధమైంది. ఈ సందర్భంగా 'బ్రహ్మ కలశ' అంటూ సాగే ఆడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. అజనీష్ లోకనాథ్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అబ్బి వి ఆలపించారు.

కాగా ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తెలుగులో ఈ సినిమా గీత ఆర్ట్స్ ద్వారా రిలీజ్ అవుతుండగా, నైజాంలో ప్రముఖ డిస్ట్రిబ్యూటర్స్ మైత్రీ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తోంది. మొత్తానికి ఈ ట్రైలర్ సినిమా పై అంచనాలను చాలా బాగా ఎలివేట్ చేసింది. మొత్తమ్మీద ఈ సినిమా పై భారీ అంచనాలను ఉన్నాయి. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# కె – ర్యాంప్ అందరినీ నవ్విస్తుంది

కుటుంబమంతా కలిసి చూసేలా 'కె ర్యాంప్' సినిమా ఉంటుందని చెప్పారు కిరణ్ అబ్బవరం. ఒకట్రెండు సంభాషణల్ని విని సినిమాపై ఎవ్వరూ ఒక అభిప్రాయానికి రావొద్దని కోరారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమే 'కె ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. జైన్స్ నాని దర్శకుడు. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా వచ్చే నెల 18న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "నేనొక అల్లరి చిల్లరి కుర్రాడిగా కనిపిస్తా. కథానాయికేమో ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియని గర్ల్‌ఫ్రెండ్‌గా కనిపిస్తుంది. అందుకే కథానాయకుడు ఎప్పుడూ ఆవేశంగా కనిపిస్తుంటాడు. వాళ్లిద్దరి మధ్య సన్నివేశాలు థియేటర్లలో అందరినీ నవ్విస్తాయి. దర్శకుడు కథ చెబుతున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నా. అది పక్కాగా తెరపైకి వచ్చింది. ప్రేక్షకులకు కావల్సినంత వినోదంతో రూపుదిద్దుకున్న 'కె



ర్యాంప్' తప్పకుండా ఆకట్టుకుంటుంది" అన్నారు. నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ "ఇప్పటివరకూ చేయని ఒక కొత్త తరహా పాత్రని పోషించా" అన్నారు. యుక్తి తరేజా మాట్లాడుతూ "కథానాయిక పాత్ర పిచ్చిగా వ్యవహరించినా, దానికొక లెక్క ఉంటుంది. ఆ పాత్రని తెరపై చూసి ఆస్వాదించాల్సిందే" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కెర్యాంప్ అనే పేరులో చెడు అర్థం లేదు. కిరణ్ అబ్బవరం ర్యాంప్ అనే మాటని దృష్టిలో ఉంచుకుని కథ రాశా. తను ఇందులో కుమార్ అనే పాత్రని చేశాడు" అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "ఈ దీపావళికి ఎంత పోటీ ఉన్నా మా సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, రచయిత రవి పాల్గొన్నారు.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in